# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :88 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 05-06-2025 | పేజీలు:4 వెల: 2.00


## పల్లెల్లో విడతల వారిగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం..

జన్నారం,పల్లెల్లో తిరిగి పేదవారికి విడతల వారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని ఎంపీడీవో సమావేశమాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పత్రాలను బుధవారం ఆయన అందజేశారు. ఆ తర్వాత పొనకల్ సింగిల్ విండో కార్యాలయంలో జీలుగా, మేలు రకమైన వడ్ల విత్తనాలను ఆయన పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ%ౌ% ఇందిరమ్మ ఇండ్లలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. మొదటి విడతగా నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేశామని, గ్రామాల్లోని అర్హులంతా అధైర్య పడకూడదని, తమ ప్రభుత్వం ఇండ్లు లేని అర్హులందరికీ తప్పకుండా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ఆయన తెలిపారు. ప్రజలంతా తన వెంట ఉంటే అభివృద్ధికి ఆటంకం కలుగజేస్తున్న అటవీశాఖ చెక్ పోస్ట్ లను తొలగించడానికి వెనుకాడబోనని ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ళను వీలైనంత తొందరగా కట్టుకున్న లబ్ధిదారులను సన్మానించనున్నట్లు ఆయన చెప్పారు.

## హడలెత్తిస్తున్న కోవిడ్.. 4,302కు చేరిన కేసులు




న్యూఢిల్లీ,దేశంలో కరోనా విజృంభిస్తోంది. గత వారం కంటే ఈ వారం వేగంగా కేసులు పెరిగిపోతున్నాయి. గత 24 గంటల్లో ఐదుగురు చనిపోయారు. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఒక్కొక్కరు చనిపోగా..మహారాష్ట్రలో ఇద్దరు చనిపోయారు. ఇక దేశ వ్యాప్తంగా 4, 302 కేసులు నమోదైనట్లు ఆరోగ్య శాఖ తెలిపింది.మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో కరోనాపై సంరక్షక మంత్రి గణేష్ నాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కోవిడ్ మరణాల పెరగడంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. గత 24 గంటల్లో దాదాపు 300 కొత్త ఇన్ఫెక్షన్లు నమోదయ్యాయని ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పేర్కొంది. కేరళలో రోజువారీ కేసులు అత్యధికంగా నమోదవుతూనే ఉన్నాయని తెలిపింది.

రాష్ట్రాల వారీగా కేసులు..

గుజరాత్‌లో మంగళవారం 108 కొత్త కేసులు నమోదు కాగా.. ఒకరు చనిపోయారు. దీంతో రాష్ట్రంలో యాక్టివ్ కేసుల సంఖ్య 461కి చేరుకుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ తెలిపింది.మహారాష్ట్రలో 86 కొత్త కేసులు నమోదు కాగా.. నలుగురు చనిపోయారు. యాక్టివ్ ఇన్ఫెక్షన్ల సంఖ్య 510కి పెరిగింది. నాగ్‌పూర్, చంద్రపూర్, మిరాజ్ వంటి జిల్లాల్లో మరణాలు నమోదయ్యాయి.దేశంలో అత్యధికంగా 1,446 యాక్టివ్ కేసులతో కేరళ అగ్రస్థానంలో కొనసాగుతోంది. తర్వాత మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ (393) కేసులు ఉన్నాయి.పశ్చిమ బెంగాల్‌లో 41 కొత్త ఇన్‌ఫెక్షన్లు, కోల్‌కతాలో ఒక మరణం చోటుచేసుకుంది. కోమోర్బిడిటీలతో బాధపడుతున్న 43 ఏళ్ల మహిళ చికిత్స పొందుతూ మరణించింది.హర్యానాలో 16 కొత్త కేసులు నమోదయ్యాయి. గురుగ్రామ్, ఫరీదాబాద్‌లో ఎక్కువ ఉన్నాయి. రాష్ట్రంలో ఇప్పుడు యాక్టివ్ కేసులు 51గా ఉన్నాయి.గత మూడు వారాల్లో ఆంధ్రప్రదేశ్‌లో 38 కేసులు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో రెండు కొత్త కేసులు నమోదయ్యాయి.గ్వాలియర్ మరియు హిమాచల్ ప్రదేశ్‌లోని సిర్మౌర్ జిల్లాలలో కూడా కొత్త కేసులు నమోదయ్యాయి.

రాష్ట్రాలకు ఆరోగ్య శాఖ పలు సూచనలు

ప్రతి తాలూకాలో కోవిడ్ సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

బహిరంగ ప్రదేశాలు, తినుబండారాల క్రిమిసంహారక చర్య చేపట్టాలి

పాఠశాలల్లో పారిశుధ్యాన్ని పాటించాలి

పరిశుభ్రత, చేతులు కడుక్కోవడం, శానిటైజర్ల వాడకంపై సలహాలు ఇవ్వాలి

## రాజకీయ కక్షతోనే కెసిఆర్ కు నోటీసులు...

హైదరాబాద్ :రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత . తెలంగాణకు నీళ్లు, నిధులు తీసుకురావటం కేసీఆర్ చేసిన తప్పా అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మూడు బ్యారేజులు కాదని.. 21పంపు హౌస్‌లు, కాళేశ్వరంతో 35శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు వస్తున్నాయని అన్నారు.కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులకు వ్యతిరేకంగా ఇందిరాపార్క్ వద్ద జాగృతి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత ధర్నా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ ధర్నా కొనసాగింది. ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో జాగృతి కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో కవిత మాట్లాడుతూ, నీళ్లు ఇచ్చిన కేసీఆర్‌కు.. రేవంత్ ప్రభుత్వం నోటీసులు ఇవ్వడాన్ని సహించబోమని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి తన గురువు చంద్రబాబు ఏపీకి గోదావరి జలాలను తరలించుకుపోతుంటే.. మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఆపమని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసే ధైర్యం రేవంత్‌రెడ్డికి లేదా అని నిలదీశారు.వెంటనే రేవంత్‌రెడ్డి.. అపెక్స్ కౌన్సిల్, కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. కాళేశ్వరం లాంటి పెద్ద ప్రాజెక్టులు కట్టినప్పుడు చిన్న సమస్యలు సాధారణమేనని తెలిపారు. కుంగిన మేడిగడ్డ పిల్లర్‌కు రిపేర్ చేయాలని కోరారు. 21కి గానూ.. 20 పంపు హౌస్‌లు మెగా కృష్ణారెడ్డి కట్టారని గుర్తుచేశారు. మెగా కృష్ణారెడ్డిని కాళేశ్వరం కమిషన్ విచారణకు పిలిచే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఆయనను విచారణకు ఎందుకు పిలవటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు కవిత.ఏపీ సీఎం చంద్రబాబు మీద ఆధారపడి బీజేపీ.. కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతోందని కవిత ఆరోపించారు. అందుకే కేంద్రమంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బనకచర్ల ప్రాజెక్ట్ గురించి మాట్లాడటం లేదని




మండిపడ్డారు. తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ అయినా ఈ విషయంపై మాట్లాడాలని కోరారు. రైతులు, జాగృతి తరుపున మాట్లాడాలని ఈటలకు విజ్ఞప్తి చేశారు. నోరు కట్టేసుకుని అపవాదు తెచ్చుకోవద్దని ఈటలను కోరారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఈటల రాజేందర్ ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని కోరారు.గోదావరిలో వెయ్యి టీఎంసీల నీళ్లు వచ్చేవరకు జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని ప్రకటించారు. దీంతో హైదరాబాద్‌కు శ్వాశతంగా నీటి అవసరాలు తీరుతాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడించారు. కేసీఆర్‌ది గట్టి గుండె కాబట్టే.. కాళేశ్వరం కట్టారని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ కలలో కూడా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టు కట్టలేదని ఎద్దేవా చేశారు. ప్రాణహిత చేవెళ్ల పేరుతో.. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16టీఎంసీలు మాత్రమే తెలంగాణకు కేటాయించారని వివరించారు. కేసీఆర్ 141 టీఎంసీలు తెలంగాణకు నిల్వ ఉండాలని కాళేశ్వరం కట్టారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేశారని విమర్శించారు.

## కెసిఆర్ పాలన నాటి అభివృద్ధి ఏదీ..మాజీమంత్రి వేముల విమర్శలు

నిజామబాద్,జూన్4, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ నాటి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పల్లె ప్రగతికార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని మాజీ మంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. దేశానికి ఆదర్శంగా కెసిఆర్ కార్యక్రమాలు ఉన్నాయని అన్నారు. విద్యుత్, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేసిన ఘనత దేశంలో కెసిఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత గ్రామాలను అభివృద్ధి బాట పట్టించేందుకే సీఎం కేసీఆర్ పల్లెప్రగతికి రూపకల్పన చేశారన్నారు. కాళేశ్వరంతో గోదావరి జలాలను మళ్లిస్తే ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. దీనికితోడు కెసిఆర్‌పై విచారణకు పూనుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రూపురేఖలు మారిపోయాయని అన్నారు. ప్రధాని మోదీ.. తెలంగాణకు చేసిందేమిలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పల్లె, పట్టణాల్లో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి జరిగిన అభివృద్ధిని చూస్తే ప్రధాని మోదీ ప్రభుత్వం తెలంగాణ ప్రాంతానికి చేసిందేమీ లేదని అన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచారని, అది చూసి ఓర్వలేకే ఇప్పుడుకాంగ్రెస్ కూడా నిందలు మోపుతోందని అన్నారు. తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలతో, ఆ పార్టీ నేతలతో రాష్ట్రానికి ఒరిగింది శూన్యమని మండిపడ్డారు.14 ఏండ్ల సుదీర్ఘ పోరాటంచేసి తెలంగాణ సాధించిన కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా, అన్ని రంగాల్లో దిక్సూచిలా నిలిపారని ఎమ్మెల్యే వేములప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ ఆనాడు తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచారని తెలిపారు. ఎందరో యువకులు తెలంగాణ కోసం



ఆత్మబలిదానాలు చేసుకున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులు సమైక్యపాలకులకు ఎదురొడ్డి ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. తెలంగాణ సిద్ధించాక కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకుని జనరంజక పాలన అందించారన్నారు. రైతుబంధు, మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబీమా లాంటి పథకాలను మీరు కూడా అమలు చేయండి అంటూ కేంద్రం, ఇతర రాష్ట్రాలకు సూచించే స్థాయికి తెలంగాణను కేసీఆర్ ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటిని సమపాళ్లలో తీసుకెళ్లారని తెలిపారు. ఏ రాష్ట్రం అయినా అభివృద్ధి చెందింది అనడానికి మూడు కొలమానా లు ముఖ్యమని, అవి తలసరి ఆదాయం, జీఎస్‌డీపీ పెరుగుదల, విద్యుత్ వినియోగం అని చెప్పారు. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో చేసింది శూన్యమని అన్నారు. నిత్యం కెసిఆర్‌ను తిట్టిపోయడానికే సమయం కేటాయిస్తున్నారని మండిపడ్డారు.

## కవిత లేఖపై కొండా సంచలన వ్యాఖ్యలు..



హైదరాబాద్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన లేఖ రాజకీయ డ్రామా మాత్రమేనని, దీని వెనుక అసలు స్కెచ్‌ను మాజీ సీఎం కేసీఆరే తయారుచేశారని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు.ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన%ౌ% ఈ డ్రామా ద్వారా కవిత మీడియా దృష్టిని ఆకర్షించగలిగిందని, హెడ్లైన్లలో నిలవడమే లక్ష్యంగా ఇది సాగించబడిందని వ్యాఖ్యానించారు. “కవిత తన ఉద్దేశాన్ని సాధించగలిగింది. బీఆర్ఎస్ ప్రజాదరణ కోల్పోతుండటంతో దృష్టి మళ్లించేందుకు ఇది వ్యూహాత్మకంగా తయారుచేసిన స్క్రిప్టు. ఇది పూర్తిగా ట్రాష్ డ్రామా. కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచే ఈ స్కెచ్‌లన్నీ జరుగుతున్నాయి,” అని కొండా తీవ్రంగా విమర్శించారు.“కేసీఆర్ కుటుంబం రాజకీయాల్లో ప్రొఫెషనల్. అవసరమైతే కాళ్లు పట్టుకుంటారు, లేకపోతే జుట్టు పట్టి తన్నేస్తారు. ఇదే వారి రాజకీయం,” అని ఘాటుగా వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్–బీజేపీ కలయికపై వస్తున్న ఊహాగానాలను కొండా ఖండించారు. “కేసీఆర్ కుటుంబ సభ్యులు బీజేపీ వద్దకు వస్తే గేట్ వద్దే తన్ని తరిమేస్తాం,” అని మండిపడ్డారు. రాజకీయాల్లో సమీకరణాలు మారినా కొన్ని విలువలు మారవని స్పష్టం చేశారు. కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో సెటైర్లు వేసిన కొండా.. “కేసీఆర్‌కు కుటుంబమే ప్రథమం, పార్టీ రెండవది, తెలంగాణ చివరిది,” అని అన్నారు. మునుగోడు ఉపఎన్నికల సందర్భాన్ని గుర్తు చేస్తూ, కాంగ్రెస్‌తో బీఆర్ఎస్ అప్పుడే పొత్తు పెట్టుకుందని ఆరోపించారు. “మేమైతే కవితను అరెస్ట్ చేశాం. మరి కాంగ్రెస్ ప్రభుత్వాలు కేసీఆర్, కేటీఆర్‌ను ఎవరినైనా అరెస్ట్ చేశాయా?” అని సూటిగా ప్రశ్నించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేత కావడం లేదు



హైదరాబాద్, వేములవాడలో కోడెల మృతి, ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేయడం చేతకావడం లేదని వ్యాఖ్యానించారు. ఎర్రగడ్డ మానసిక రోగులకు తగిన ఆహారం కూడా అందడం లేదని 70 మంది అస్వస్థతకు గురయ్యారని, ఈ విషయంపై ఇప్పటివరకు సీఎం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదని మండిపడ్డారు.

వేములవాడలో కోడెల మరణం కొనసాగుతుండగా ప్రభుత్వం స్తంభించినట్లే ఉంది అని వ్యాఖ్యలు చేశారు.అనేక కోడెలు గడ్డి లేక చనిపోతున్నా, ప్రభుత్వం పట్టింపు తీసుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. “మాకు బాధ్యత అప్పగిస్తే కోడెలను కాపాడుతాం” అని స్పష్టత ఇచ్చారు. ఈ మధ్యే మాపై కేసులు పెట్టడం, కమిషన్లు ఏర్పాటు చేయడం తప్ప అసలు సమస్యలపై ప్రభుత్వాన్ని పట్టించుకోడం లేదని, నిజమైన ప్రజా సమస్యలను వదిలి మిగతా విషయాల్లో బిజీ అయ్యారని తెలిపారు. ఇక రేపటి కేబినెట్ సమావేశంలో రైతు బంధు డబ్బులను వెంటనే విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తీవ్రంగా పిలుపునిచ్చారు.

## ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఫుడ్ పాయిజన్.. మంత్రి దామోదర్ ఏమన్నారంటే..

హైదరాబాద్: ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ అవతరణ దినోత్సవం (జూన్2)రోజున ఫుడ్ పాయిజన్ ఘటన జరిగిందని తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ఈ ఘటనలో మొత్తం 92 మంది రోగులు ఫుడ్ పాయిజన్ కారణంగానే అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో అస్వస్థతకు గురైన బాధితులను మంత్రి దామోదర ఇవాళ(బుధవారం) పరామర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులతో మంత్రి మాట్లాడారు.ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఘటనపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మంత్రి దామోదర మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఆస్పత్రి డైట్ కాంట్రాక్టర్‌ను తొలగించాలని మంత్రి దామోదర ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. అస్వస్థతకు గురైన వారందరి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని చెప్పుకొచ్చారు. డైయిట్ కారణంగానే ఈ ఫుడ్ పాయిజాన్ జరిగినట్లుగా తెలుస్తోందని అన్నారు. ఆ రోజు ఒక స్వీట్ కూడా అదనంగా రోగులకు ఇచ్చారని వివరించారు మంత్రి దామోదర రాజనర్సింహ.అనారోగ్యం పాలైన వారిలో తీవ్రంగా ఉన్న 18 మందిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని మంత్రి దామోదర రాజనర్సింహ వివరించారు. మిగతా రోగులని గాంధీ, ఉస్మానియాతో



పాటు మొత్తం ఆరు వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నాయని వెల్లడించారు. అనారోగ్యం పాలైన వారి ప్రాణాలకు ప్రమాదం లేదని.. వారు మరో రెండు రోజుల్లో కోలుకుంటారని వైద్యులు తెలిపారని చెప్పారు. ఇక్కడ డైట్ చూసుకునే కాంట్రాక్టర్ పనితీరు సైతం సరిగా లేదని సమాచారం అందిందని.. అతని కాంట్రాక్ట్ రద్దు చేశామని తెలిపారు మంత్రి దామోదర రాజనర్సింహ.జరిగిన ఘటనపై ఒక కమిటీని నియమించాయని తెలిపారు. కమిటీ రిపోర్టు రాగానే బాధ్యులపై చర్యలు ఉంటాయని అన్నారు. ఇప్పటికే ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని చెప్పారు. చనిపోయిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. కరోనాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి దామోదర రాజనరసింహ పేర్కొన్నారు.

## పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ వచ్చేసింది..

న్యూఢిల్లీ,పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ విడుదలైంది. జూలై 21 నుంచి ఆగస్టు 12 వరకు సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ప్రకటించారు.మూడు నెలల విరామం తర్వాత ఉభయ సభలు ప్రారంభం అవుతున్నాయి. పార్లమెంట్, రాజ్యసభ ఉదయం 11 గంటలతో సమావేశాలు ప్రారంభం కానున్నాయి. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జనవరి 31న ప్రారంభమై ఏప్రిల్ 4న ముగిశాయి. అనంతరం ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఇక వర్షాకాల సమావేశాల్లో విధానపరమైన అంశాలు, పెండింగ్‌లో ఉన్న చట్టాలు, రాజకీయ పరిణామాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది.పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారతప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. అయితే ఈ పరిణామాలపై చర్చించేందుకు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్.. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. కానీ అందుకు కేంద్రం అంగీకరించలేదు. దీంతో ఈ అంశాలపై కేంద్రాన్ని ప్రతిపక్షం నిలదీసేం దుకు సన్నద్ధమవుతోంది. అయితే అన్ని విషయాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని



కిరణ్ రిజిజు తెలిపారు.ఇదిలా ఉంటే ఈ సమావేశాల్లో పలు కీలక బి ల్లులు సభలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా పాకిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రక్షణ రంగం కోసం సప్లిమెంటరీ బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

## మాజీ మంత్రి బొత్స సత్య నారాయణకు అస్వస్థత!



విజయగరం:వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురయ్యారు. వైసీపీ నిర్వహించిన ‘వెన్నుపోటు దినం’ నిరసన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఒక్కసారిగా కుప్పకూలారు.బొత్స అస్వస్థతకు గురవడంతో వైసీపీ నేతలు వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించారు. బీపీ తగ్గడంతో ఆయన ఇబ్బంది పడ్డారు. గరివిడి నుంచి విజయగరంకు బొత్స బయల్దేరారు.వైసీపీ ఆధ్వర్యంలో ‘వెన్నుపోటు దినం’ నిరసన ర్యాలీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోంది. చీపురుపల్లిలోని ఆంజనేయపురం నుంచి స్థానిక మూడురోడ్ల కూడలి వరకు నిర్వహించిన ర్యాలీలో వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు. మైకులో మాట్లాడుతుండగానే ఆయన ఒక్కరిగా సొమ్మసిల్లి పడిపోయారు. పార్టీ నేతలు వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఎండ, వేడి ఎక్కువగా ఉండటంతో బొత్స వడదెబ్బకు గురైనట్లు తెలుస్తోంది.ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయినా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. సూపర్ సిక్స్ సహా 143 హామీలతో ప్రజలను నమ్మించి మోసం చేశారని వైసీపీ ఉద్యమబాట పట్టింది.


## సంపాదకీయం

**గురువారం 05-06-2025**

# వృధానీటి వినియోగం చేపట్టాల్సిందే !

అభివృద్ధి అంటే ఆర్థికాభివృద్ధి మాత్రమే అని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. -రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి జలవనరులు దోహదపడతాయి. వృధాగా పోతున్న నీటిని వాడుకోవాల్సిందే. బీళ్లకుమళ్లించాల్సిందే. అందుకు నదుల అనుసంధానం ముఖ్యం. ఎక్కడో ఒకచోట దీనికి అడుగు పడాలి. గోదావరి నదీ జలాలతో తెలుగు రాష్ట్రాలను సమగ్రంగా అభివృద్ధి చేయవచ్చు. అయితే ఇప్పటి వరకు కట్టిన ప్రాజెక్టులు ఏవీ గోదావరి జలాల వినియోగంలో పెద్దగా ఉపయోగపడడం లేదు. కాళేశ్వరం కేవలం ఎత్తిపోతలుకావడంతో దానివల్ల నీటిని నిల్వ చేయలేము. కేవలం పోలవరం మాత్రమే నీటిని నిల్వ చేయగలదు. విభజన చట్టంలో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం హడావిడి చేసింది. రూ.33 వేల కోట్లతో చేయవలసిన పునరావాస పనులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. నూతన ప్రభుత్వం వాస్తవాలను ప్రజలకు వివరించి, పునరావాసంతో సహా ప్రాజెక్టును పూర్తి చేయాలి. గోదావరి నదీ జలాలను కృష్ణానదికి తరలింపుపై నిపుణులతో, అఖిలపక్షాలతో చర్చించిన తరువాత నిర్ణయాలు చేయాలి. బనకచర్లపై అనుమానాలు తొలగించాలి. కేంద్రానికి నివేదిక సమర్పించిన ఎపి ప్రభుత్వం తెలంగాణతో కూడా చర్చించి అనుమానాలు నివృత్తిచేసుకోవాలి. నీటిని ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలు చర్చించాలి. ఇకపోతే ఉత్తరాంధ్రాలో వంశధార, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుల ను పూర్తి చేయాలి. ప్రకాశం జిల్లాకు ప్రాణప్రదమైన వెలిగొండ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. కానీ ఆ దిశగా కార్యాచరణ సాగలేదు. 1956లో ఏర్పడిన ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధిని హైదరాబాద్ చుట్టూ కేంద్రీకృతం చేశారు. ప్రభుత్వరంగంలో భారీ పరిశ్రమలు, ఫార్మాస్యూటికల్ కంపెనీలు, ఐ.టి పరిశ్రమలు, కేంద్ర కార్యాలయాలన్నీ హైదరాబాదు లోనే అభివృద్ధి చేశారు. రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాజధాని అమరావతి పేరుతో కేంద్రీకరణకు పూనుకున్నది. రాజధాని నిర్మాణానికి 33 వేల ఎకరాల భూసమీకరణ, నవ నగరాల నిర్మాణ ఆలోచనలు, సింగ్‌పూర్ కంపెనీలతో స్టార్టప్ ఒప్పందం, స్విస్ ఛాలెంజ్ పద్ధతి, ప్రైవేటు సంస్థలకు భూముల కేటాయింపు మొదలైన చర్యలన్నీ చేపట్టింది. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాయలసీమలో కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా ప్రకటించి, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని విభజన చట్టంపేర్కొన్నది. ఇతర జిల్లాలలో కూడా అనేక ప్రాంతాలు వెనుకబడి వున్నాయి. ప్రకాశం, గుంటూరు జిల్లాలో పల్నాడు ప్రాంతం, తూర్పు గోదావరి జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం, పశ్చిమ గోదావరి జిల్లాలో గిరిజన ప్రాంతం, కృష్ణా జిల్లాలో ఎ. కొండూరు, గంపల గూడెం వంటి ప్రాంతాలు వెనుకబడి వున్నాయి. విభజన చట్టంలో చెప్పిన విధంగా కడప ఉక్కు కర్మాగారం, దుగ్గరాజపట్నం/ రామాయపట్నం ఓడరేవు ప్రభుత్వ రంగంలో నిర్మాణం జరగాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పాలి. నీటి వనరుల ఆధారంగా వ్యవసాయం, వెనుకబాటు తనం ఆధారంగా పరిశ్రమలు స్థాపించినప్పుడే సమగ్ర అభివృద్ధి జరుగుతుంది. అందుకు చంద్రబాబు ప్రభుత్వం కంకణం కట్టుకోవాలి. ఇకపోతే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత మళ్లీ రాజధాని అమరావతికి ప్రాణప్రతిష్ట జరగడంతో పాటు..టెండర్లు ఖరారు కావడంతో పనులు వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. రాజధాని అన్నది రాష్ట్రానికి, దేశానికి వెన్నముక లాంటిది. అదే లేకుంటే ఏం జరిగిందో గత ఐదేళ్ల జగన్ పాలనలో చూశాం. రాజధాని నిర్మిణం పూర్తయివుంటే ఆర్థిక లావాదేవీలు సాగుతాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగు తాయి. ఇవేవీ పట్టని జగన్ ఐదేళ్ల పాటు రాజధాని పేరుతో డ్రామాలు ఆడారు. రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం దాటింది.రెండు రాష్ట్రాల్లో పనితీరులో భేదం స్పష్టంగా కనిపిస్తోంది. ఉమ్మడి రాజధానికి కాలం చెల్లడంతో ఎపికి అమరావతిని చంద్రబాబు ప్రతిపాదించారు.ఆయన ఏది చూసినా ముందుచూపుతో చేస్తారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా చేస్తారు. అందుకు హైదరాబాద్‌లో ఐటి విస్తరణకు వేసిన పునాది చూడవచ్చు. ఇవాళ హైదరాబాద్ ఇంతగా అభివృద్ధిలో దూసుకుపోవడానికి చంద్రబాబు వేసిన తొలి అడుగే అని చెప్పక తప్పదు. ఐదేళ్ల జగన్ పాలనలో రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోయింది. ఉమ్మడి ఎపితో పోలిస్తే తెలంగాణలో కొన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కళ్లకు కట్టాయి. ఉమ్మడి హైదరాబాద్‌లో పదేళ్లు ఉండే వీలున్నా..అమరావతి కోసం ఆనాటి సిఎం చంద్రబాబు మకాం మార్చారు. అమరావతి కోసం నానా కష్టాలు పడ్డారు. అద్భుత నగరంగా.. హైదరాబాద్‌ను తలదన్నేలా నిర్మించాలన్న సంకల్పాన్ని ప్రకటించారు. కానీ ఆయన కలలు కల్లలు అయ్యాయి. అధికారం కోల్పోవడంతో అమరావతని కాలదన్నారు. హైదరాబాద్ లో జరిగిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మరో విశ్వనగరం నిర్మించాలన్న చంద్రబాబు కలలు సాకారం కాలేదు. ఇప్పుడు తిరిగి కూటమి అధికారంలోకి రావడంతో రానున్నమూడేళ్ల కాలంలో అమరావతి పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్దం అయ్యాయి. అమరావతితో పాటు, పోలవరం పూర్తి చేస్తే ఎపికి మహర్దశ పట్టనుంది. ఇదే సందర్భంలో గత జగన్ ప్రభుత్వంలో కాకుండా..అభివృద్ధి పేరుతో డబ్బుల పందేరానికి ఇక చెల్లుచీటి పలకాలి. లేకుంటే ఖజానా గుల్ల కాగలదు. ఎపిలో దశాబ్ద కాలంగా రాజధాని లేకుండా నెట్టుకు వచ్చారు.. రాజధాని ఏదంటే చెప్పలేని దైన్యంలో ప్రజలు ఉన్నారు. అమరావతి ఆగిపోయింది. పోలవరం నిలిచి పోయింది. భోగాపురం వరుసగా శంకుస్థాపనలకే పరిమితం అయ్యింది. ఈ క్రమంలో మళ్లీ అన్నీ పనులు వేగంగా పుంజుకుంటున్నాయి. రానున్న ఐదేళ్లలో ఎపి రూపురేఖలు మారుతాయనడంల సందేహం లేదు. మచిలీపట్టణం తదితర పోర్టులకు కూడా ఇప్పుడే అడుగులు పడ్డాయి. పదేళ్లలో ఎక్కడా గుర్తించదగ్గ అభివృద్ధి కానరాలేదు. ఓ రకంగా తెలంగాణతో పోలిస్తే అన్నింటా వెనకబాటే కనిపిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తాయి. అందుకే ప్రజలు తిరిగి తెలుగుదేశం కూటమికి అధికారం కట్టబెట్టారు. తెలంగాణలో 24 గంటల కరెంట్ అందుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సిఎం రేవంత్ కూడా అభివృద్ధిపై స్పష్టమైన విజన్‌తో ముందుకు సాగుతున్నారు. గతంలో టిడిపి అధికారంలో ఉండగా చేపట్టిన అమరావతిలో అసలు నిర్మాణాలు జరగలేదని, డబ్బు వృధా చేశారని అన్న వాదనలను తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం ముమ్మరం చేసింది. అలాగే విశాఖకు రాజధాని తరలింపు ప్రక్రియను ముమ్మరం చేసింది. మూడు రాజధానులంటూ కనీసం ఒక్క రాజధానిని కూడా ప్రకటించలేక పోయారు. దీనికితోడు రైతులు ఆందోళనలు కొనసాగుతున్నా పట్టించుకోలేదు. భూములిచ్చిన రైతులు మోసపోయారు. ఆ భూముల్లో పేదలకు పట్టాలు ఇవ్వడంతో ఇప్పుడు రైతులు పరిస్థితి కక్కలేక మింగలేక అన్న చందంగా మారింది. తమ భూములను తమకిమ్మని అడిగే ధైర్యం కూడా లేకుండా పోయింది. నవ్యాంధ్ర మొదటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎన్నికైన తర్వాత రాజధాని అమరావతి నిర్మాణం కోసం రైతుల నుండి వేలఎకరాలు సమీకరించారు. నిర్మాణాలు చేపట్టినా, పూర్తి చేయడంలో తీవ్ర అలసత్వం చూపించారు. దీంతో ఎక్కడి వక్కడే ఆగిపోయాయి.

# సంయమనం అవసరం...




న్యూఢిల్లీ,నెత్తురు చిందకుండా, నష్టం జరగకుండా యుద్ధం సాగుతుందనీ, ముగుస్తుందనీ ఎవరూ అనుకోరు. ప్రత్యర్థిని చిత్తు చేద్దామని ఇరుపక్షాలూ విశ్వప్రయత్నం చేస్తాయి. కానీ అనేక కారణాలవల్ల ఎవరో ఒకరినే విజయం వరిస్తుంది. ఇందులో సరైన అంచనాలకు రాలేకపోవటం దగ్గరనుంచి స్థానిక వాతావరణ స్థితిగతుల వరకూ చాలా వుంటాయి. ఈ సంగతి తెలిసి కూడా మన విపక్షాలు, ప్రత్యేకించి కాంగ్రెస్ మొన్నటి 'ఆపరేషన్ సిందూర్'లో మనకు కలిగిన నష్టాలగురించి వెంటనే వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నాయి. యాదృచ్ఛికంగానే కావొచ్చుగానీ... మన రక్షణ దళాల చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ శనివారం సింగపూర్‌లో మాట్లాడుతూ మన దళాలు చేసిన కొన్ని 'వ్యూహాత్మక తప్పిదాల' కారణంగా జెట్ విమానాలు కోల్పోయామని చెప్పటం వివాదాస్పదమైంది. ఆ అంశాన్ని ప్రభుత్వ పెద్దలకు వదలటం లేదా వారితో చర్చించి ఎప్పుడు ఏ విధంగా చెప్పాలో సలహా తీసుకోవటం సరైన విధానం. విదేశీ గడ్డపై చెప్పటమైతే ఎంతమాత్రమూ సరికాదు. పైగా ఆయన సింగపూర్ వెళ్లింది ఏటా జరిగే అంతర్ ప్రభుత్వాల భద్రతా వ్యవహారాలపై నిర్వహించే 'షాంగ్రీ లా డైలాగ్' కోసం. అందులో పాకిస్తాన్ త్రివిధ దళాల చీఫ్ కూడా పాల్గొన్నారు. ఒకపక్క మన ఎంపీల అఖిలపక్ష బృందాలు పాకిస్తాన్ ఆగడాల గురించీ, వాటిని నిలువరించక తప్పని స్థితి గురించీ వివరించటానికి వేర్వేరు దేశాల్లో పర్యటిస్తున్నాయి. కనుక జనరల్ చౌహాన్ ప్రకటన ఏ రకంగా చూసినా సమయం, సందర్భం లేనిది. కొందరు మాజీ సైనికాధికారులూ, నిపుణులూ చెప్పినట్టు పాకిస్తాన్‌కు మన దళాలు కలిగించిన భారీ నష్టంతోపాటు దీన్నీ చెప్పివుంటే ఇంత వివాదమయ్యేది కాదేమో! గత నెల 7 నుంచి పదో తేదీ వరకూ సాగించిన దాడుల్లో మన నష్టం ఏపాటో చెప్పాలని విపక్షాలు కోరుతున్నాయి. దాడి చేయటానికొచ్చిన రఫేల్ యుద్ధ విమానాలను కూల్చేశామని పాకిస్తాన్ ప్రభుత్వం చేసిన ప్రచారం ఆధారంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఈ డిమాండ్ మొదలుపెట్టారు. మన సైనిక దళాలు సాధిస్తున్న విజయాలను ఎన్డీయే ప్రభుత్వం తన సత్తాకు ప్రతీకగా చెప్పుకోవటాన్ని నిరోధించేందుకు విపక్షాలు ఈ ప్రయత్నం చేసివుండొచ్చు. కానీ ఎప్పుడు ఎక్కడ ఎలా దాడిచేయాలనే అంశాలను పూర్తిగా త్రివిధ దళాలకు అప్పగించాక వాటిపై అనుకూలంగా లేదా వ్యతిరేకంగా మాట్లాడటం ఎవరు చేసినా తప్పే. యుద్ధంలో తొలి క్షతగాత్ర సత్యమేనంటారు. ఎందుకంటే అవతలి పక్షాన్ని చావుదెబ్బ తీశామని, అనేకమంది శత్రు సైనికుల్ని హతమార్చామని, కీలక స్థావరాలు ధ్వంసం చేశామని ప్రభుత్వాలు చెప్పటం ప్రపంచంలో ఎక్కడైనా వున్నదే. యుద్ధం ముగిసిన కొన్నాళ్లకుగానీ వాస్తవ గణాంకాలు బయటకు రావు. మన విపక్షాలు అంతవరకూ ఆగలేకపోయాయి. పాక్ మీడియా వార్తల్ని విశ్వసించి మన ప్రభుత్వాన్ని నిలదీయటం మొదలుపెట్టాయి. ఇదంతా రాజకీయంగా బీజేపీకి లాభిస్తుందన్న ఆందోళనే దీనికి కారణం. ఎప్పుడూ లేనివిధంగా 'ఆపరేషన్ సిందూర్' సమయంలో సామాజిక మాధ్యమాల్లో, చానెళ్లలో మన సేనలు పాకిస్తాన్ నగరాలను నేలమట్టం చేయటం మొదలుకొని పలు విజయాలు సాధించినట్టు ప్రచారం సాగింది. ఇదెంత ముదిరిందంటే... ఒక దశలో మన ప్రభుత్వం ఖండించాల్సి వచ్చింది కూడా. మరోపక్క యుద్ధంవల్ల కలిగే అనర్థాల గురించి చెప్పిన మాజీ సైనికాధికారులనూ, వారి కుటుంబసభ్యులనూ దూషించటం, ఉగ్రవాదుల దుర్మార్గానికి భర్తను కోల్పోయిన యువతి ముస్లింలపై ద్వేషం వద్దని అన్నందుకు ఆమెను దుర్భాషలాడటం వంటి వైపరీత్యాలూ చోటుచేసుకున్నాయి. కొందరైతే దాడులు నిలిపేస్తున్నట్టు ప్రకటించిన మన విదేశాంగ శాఖ కార్యదర్శిపైనా, ఆయన కుటుంబసభ్యులపైనా నోరుపారేసుకున్నారు. యుద్ధకాలంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇచ్చే సూచనలనూ, సలహాలనూ పాటించటం తప్ప ఉన్మాదం ఆవహించినట్టు ఊగిపోవటం సరైంది కాదు. ఇందువల్ల మన జవాన్లకు వీసమెత్తు ఉపయోగం లేదు సరికదా... ప్రజల్లో తప్పుడు భావాలు వ్యాప్తి చెందే ప్రమాదం వుంటుంది. దాడులు ఎప్పుడు మొదలెట్టాలో, ఎప్పుడు ఆపాలో, ఏ దశలో ఏం చేయాలో నిర్ణయించటానికి ప్రభుత్వం ఉన్నప్పుడు గుంపులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించటం అనర్థదాయకం.చౌహాన్ చెబుతున్న ప్రకారం నాలుగు రోజుల దాడుల్లో తొలి రెండు రోజులూ మనకు నష్టం వాటిల్లింది. వెంటనే లోపాలు గుర్తించి సరిచేసుకోవటం పర్యవసానంగా ఆ తర్వాత మన జెట్ విమానాలు శత్రు స్థావరాలను ధ్వంసం చేయగలిగాయని ఆయన అన్నారు. ఏ లోపమూ చోటుచేసుకోకుండా, ఏ నష్టమూ జరగకుండా మనం కోరుకున్న ప్రకారం అంతా జరిగిపోవాలనుకునేవారికి ఇది నిరాశ కలిగించవచ్చు. బీజేపీ అగ్ర నాయకులంతా ఈ విజయాలను తమ వ్యక్తిగత ఖాతాలో వేసుకోవటం కాంగ్రెస్ పార్టీకి కంటగింపు కావొచ్చు. కానీ దేశ రక్షణకు సంబంధించిన అంశాల్లో సంయమనం పాటించటం అందరి బాధ్యత. దాడులు ప్రారంభించటానికి ముందు అఖిలపక్ష సమావేశం నిర్వహించి వారి మద్దతు కోరిన ప్రభుత్వం ముగించటానికి ముందు కూడా ఆ పనే చేసివుంటే బాగుండేది. కనీసం మన దళాలు సాధించిన విజయాలు, మన నష్టాల గురించి ఈ నెల్నాళ్లలోనైనా అఖిలపక్షం నిర్వహిస్తే సమస్య తలెత్తేది కాదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఈ తరహా ఉదంతాలు ఇకపై పునరావృతం కాకూడదనుకుంటే కేంద్రం ఆ పని చేయాలి. అందులో అధికార, విపక్షాల వ్యవహారశైలి గురించీ, కొన్ని శక్తులనుంచి అతిగా వచ్చిన స్పందనల గురించీ తన వైఖరేమిటో చెప్పాలి. కష్టకాలంలో సంయమనం పాటించటం ఎంత ముఖ్యమో వివరించాలి.

# విద్య హక్కా.. అమ్మకానికి కొనే వస్తువా?

హైదరాబాద్,ఒక దేశం పురోగతిని నిర్ణయించే అత్యంత కీలకమైన అంశం.. 'విద్య'. కానీ, ఆ విద్యే ఇప్పుడు పేదలపై పెనుభారం అవుతోంది. ప్రతి ఏడాది రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభం అనగానే ప్రారంభమయ్యే ఫీజుల దండయాత్ర, నిబంధనలు లెక్కచేయని ప్రైవేట్ స్కూళ్ల వ్యవహారం ఒక క్రమంగా ఏర్పడిన విద్యా వ్యాపార మాఫియా రూపాన్ని స్పష్టంగా చూపుతోంది. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం అసమర్థతతోనే కాదు, అమాయకత్వంతోనూ విలవిల్లాడుతున్నారు. సమాజం నడిచే దారిలో అంధకారపు గోడలా నిలిచిన ఈ విద్యా దోపిడీ ప్రభుత్వ అధికారుల మౌనంతో మరింత బలపడుతోంది. విద్యను వాణిజ్యమయ్యే చీకటి గుహల నుంచి వెలికి తీయాల్సిన బాధ్యత మనందరిదీ.నిబంధనలు ఉన్నా, నిబంధించే వాళ్లే లేరనే అసహాయత తల్లిదండ్రుల కన్నీళ్లలో ప్రతిబింబిస్తోంది. 'విద్యా హక్కు చట్టం' ఉన్నా, ఆ హక్కు కేవలం పుస్తకాలకే పరిమితమైంది. ప్రస్తుతం విద్య, హక్కుగా కాకుండా, ధనవంతులకు మాత్రమే దక్కే విలాస వస్తువుగా మారిపోయింది. ఈ నేపథ్యంలో, ప్రశ్నించాల్సిన సమయం ఇదే.. ప్రజలు మేలుకోవాల్సిన వేళ ఇదే. విద్యను వాణిజ్యపు చీకటి గుహల నుంచి వెలికితీయాల్సిన బాధ్యత మనందరిదీ. ఎందుకంటే.. విద్య విక్రయించేది కాదు వికాసించాల్సింది! ఈ తతంగం ప్రతియేటా పునరావృతమవుతూనే ఉంది. దీన్ని తక్షణం చట్ట పరంగా, ప్రజాపరంగా, నైతికంగా అణిచివేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పునరావృతమవుతున్న విద్యా దోపిడీ..

కేవలం విద్యా సంవత్సర ప్రారంభంలో కొద్ది రోజుల పాటు మాత్రమే విద్యార్థి సంఘాలు నిరసనలు చేస్తూ కనిపిస్తాయి. అవి చాలావరకు సంక్షిప్త నిరసనలూ, తాత్కాలిక ఒప్పంద చలనాలుగా మారిపోతూ, మౌలికంగా వ్యవస్థను ఎదిరించలేకపోతున్నాయి. తల్లిదండ్రుల ఆర్థిక బంధనాలు, నిస్సహాయత ఇవన్నీ కలిసి ఒక నాటకంలా ప్రతి సంవత్సరం జరుగు తున్నాయి. ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండటంతో, ప్రైవేట్ యాజమాన్యాల ఇష్టారాజ్యమే చెల్లుతోంది. నాణ్యతా ప్రమాణాలెరుగని స్కూల్లు ఒలింపియాడ్, టెక్నో, ఈ-టెక్నో, ఇంటర్నేషనల్ వంటి ఆర్భాట పదాలతో తల్లిదండ్రులను మభ్యపెడుతూ, తమ పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫామ్స్, రవాణా ఫీజులు, స్టేషనరీని అధిక ధరలకు విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయి. ప్రతి సంవత్సరం ఈ అన్యాయపు తతంగం ఒక నిశ్చల దృశ్యంగా పునరావృతమవుతూనే ఉంటుంది. సమాజంలో మేధావులు, మానవ హక్కుల వేత్తలు నిర్లక్ష్యం చేయడం వల్ల ఫీజు దోపిడీ ఎటువంటి అడ్డుకట్ట లేకుండా విస్తరిస్తోంది. ఇది ఒక 'విద్యా అత్యాచారం' మాత్రమే కాదు. సమాజ హక్కుల పట్ల నిర్లక్ష్యం, ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనం.

విద్య హక్కా.. అమ్మకానికి కొనే వస్తువా?

విద్య, ఆర్థిక సామర్థ్యంగా కొనుగోలు చేసే వస్తువు కాదు. ఇది ప్రతి పౌరుడి మౌలిక హక్కు. మన భారత రాజ్యాంగం ఆర్టికల్ 21%ూ% ద్వారా 6%-%14 ఏళ్ల పిల్లలందరికీ ఉచిత, తప్పని సరి విద్యను హామీ ఇస్తోంది. అయినా, ప్రస్తుత పరిస్థితుల్లో ఇది కేవలం 'కాగితపు హక్కు'గా మిగిలిపోతోంది. ప్రత్యేకించి తెలంగాణలో ప్రతీ విద్యా సంవత్సరం ప్రారంభం వేళ ప్రైవేట్ పాఠశాలలు




చేసే ఫీజు దోపిడీ, నిబంధనల ఉల్లంఘన, అధిక ధరల పుస్తకాలు, యూనిఫాంల పేరుతో జరుగుతున్న వ్యాపారం ఇవన్నీ మౌలిక విద్యా హక్కుకే సవాలు విసురు తున్నాయి. ఈ పరిస్థితులపై స్పందించకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వం విద్యను వాణిజ్య మాఫియాల చేతుల్లో పెట్టేసినట్టే. నాణ్యత, సమానత్వం, సామర్థ్యానికి బదులు ఇప్పుడు స్కూల్ ఎంపిక 'ధన సామర్థ్యం' ఆధారంగా మారిన దుస్థితి ఏర్పడింది. దీన్ని ప్రశ్నించకపోతే, ఆర్థికంగా వెనుక బడిన తరగతులు విద్య నుండి పూర్తిగా తప్పించబడే ప్రమాదం ఉంది. విద్యను హక్కుగా కాక, ఖరీదైన వస్తువుగా మారుస్తున్న ఈ వ్యవస్థపై చర్చలు జరగడం లేదు.

ప్రభుత్వ నియంత్రణ అవసరం!

తెలంగాణలో ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీ, నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా, నిస్సహాయంగా వ్యవ హరిస్తోంది. అనుమతుల లేకుండా ఫీజుల వసూలు, గుర్తింపు నిబంధనల ఉల్లంఘనపై చర్యల్లో వైఫల్యం కనిపిస్తోంది. అధికారులు జారీ చేసిన నోటీసులు అమలుకాక, డీఈఓ, ఆర్‌జేడీ స్థాయిలో పర్యవేక్షణ తక్కువగా ఉంది. ప్రభుత్వ పాఠశాలలు బలహీనంగా ఉండటంతో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలవైపు మొగ్గుతున్నారు. మౌలిక వసతులు, బోధన నాణ్యత, భద్రతలో ప్రభుత్వ పాఠశాలలు పోటీ చేయలేకపోతున్నాయి. ప్రభుత్వం విద్యను హక్కుగా కాపాడకుండా, వాణిజ్య వస్తువు గా మలచడంపై విమర్శలు వస్తున్నాయి. 2017లో ఏర్పాటైన %ూ-ాఖీ=జ% నివేదికలు అమలు కావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అధిక ఫీజుల నియంత్రణకు పూర్తి అధికారాలతో కమిషన్ ఏర్పాటు చేయాలి. విద్యాహక్కు చట్టాన్ని పూర్తిగా అమలు చేయాలి. ప్రభుత్వ పాఠశాలలను బలపరచాలి. పాఠశాలలపై పబ్లిక్ ఆడిట్, పారదర్శకత పెంచాలి. ప్రత్యేక విద్యా మానిటర్‌లతో పాటు డీఈఓ, ఆర్‌జేడీలు పర్య వేక్షణను పటిష్టంగా నిర్వహించాలి. తరచూ ఆడిట్‌లు, ఫీజు సమీక్షలు జరపాలి. ఫీజు లెక్కలను ప్రతినెలా బ్యాలెన్స్ షీట్ రూపంలో ప్రభుత్వానికి అందించేలా చేయాలి. అన్ని జిల్లాల్లో ప్రత్యేక ఫిర్యాదుల కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు చేయాలి. పేరెంట్ ఆన్ బోర్డింగ్ కమిటీలు ఉండాలి. ఉల్లం ఘనలు, దోపిడీపై శిక్షార్హ చర్యలు, లైసెన్స్ రద్దు చేపట్టాలి. విద్యారంగానికి ప్రత్యేక న్యాయవ్యవస్థ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ బాధ్యత విషయంలో ప్రజా ఉద్యమం, న్యాయ ఒత్తిడి, శాసన మార్గాల ద్వారా ఒత్తిడి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# మైనర్ బాలికపై అత్యాచారం కేసు..తాపీమేస్త్రీ నాగరాజుకు 20 ఏళ్ల జైలు

హైదరాబాద్, సరూర్‌నగర్ పీఎస్‌లో నమోదైన మైనర్ బాలికపై అత్యాచారం కేసులో రంగారెడ్డి కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడికి రంగారెడ్డి జిల్లా కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామచంద్రాపురానికి చెందిన దర్శనం నాగరాజు.. అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఉంటూ తాపీమేస్త్రిగా పనిచేసేవాడు. సరూర్‌నగర్ పరిధిలో ఉండే మైనర్ బాలికను 2024లో పెళ్లి పేరుతో తీసుకెళ్లి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. పోక్సో యాక్ట్‌తో పాటు చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసిన సరూర్‌నగర్ పోలీసులు నాగరాజును అరెస్టు చేసి జైలుకు తరలించారు. దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేసిన విచారణాధికారి సైదిరెడ్డి... కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట ట్రాక్ కోర్టు.. నాగరాజుకు 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.6 లక్షల పరిహారం ప్రకటించింది. కేసు నమోదైన అనతి కాలంలోనే నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన విచారణాధికారి, న్యాయవాదులు, కోర్టుకు.. బాధిత కుటుంబసభ్యులు

# ఆగస్ట్ 15 నాటికి భూ సమస్యలు పరిష్కారం

జనగామ, ధరణి పోర్టల్‌కి భూభారతి పోర్టల్‌కు నక్కకు నాగలోకానికి ఉన్నంతా తేడా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భూ భారతితో రెవెన్యూ సమస్యల పరిష్కారం దిశగా నడుస్తున్నామన్నారు. సోమవారం పాలకుర్తిలో మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ.. . జూన్ 3 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి ద్వారా అధికారులు ప్రజల దగ్గరకే వస్తారని చెప్పారు. జూన్ 3 నుంచి 20 తేదీ వరకు రెవెన్యూ వ్యవస్థే మీ గ్రామానికే వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ఆగస్టు 15 నాటి భూ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అన్ని మండలాల్లో -ట్రైనింగ్ ఇచ్చిన సర్వేయార్లతో సర్వే జరుగుతుందని తెలిపారు. ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్ల బిల్లు ప్రభుత్వం విడుదల చేస్తోందన్నారు. ఇళ్లు రాలేదని ఎవరు ఆందోళన, నిరుత్సాహపడవద్దని.. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ స్కీమ్ నిరంతరంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. నిరుపేదైన ప్రతి ఒకరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. రాబోయే రోజుల్లో కొత్త రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. రాజీవ్ యువ వికాసం పథకానికి ఎవరూ ఊహించని విధంగా అప్లికేషన్లు వచ్చాయన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో అక్రమాలు జరగొద్దని.. ఒక్క అనర్హుడికి కూడా లబ్ది జరగొద్దనే ఉద్దేశంతోనే స్కీమ్ ఇంప్లిమెంట్‌కు కొంత ఆలస్యం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ సంఘాలతో రెండు మూడు పర్యాయాలు ఇంతకుముందే చర్చించామని తెలిపారు. జూన్ 5న జరగబోయే కేబినెట్ భేటీలో ఉద్యోగుల సమస్యలపైన చర్చిస్తామని తెలిపారు. ఉద్యోగులను మా ప్రభుత్వం గౌరవిస్తుందని.. అదే విధంగా ఉద్యోగులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

# పర్యావరణం పరంగా కొల్లేరు కీలకం

అమరావతి,పర్యావరణం పరంగా కీలకమైన కొల్లేరు సరస్సును తప్పక రక్షించుకోవాలని సీఎం చంద్రబాబు అన్నారు. కొల్లేరు వాసుల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాల్సి ఉందన్నారు. కొల్లేరుపై కేంద్ర సంస్థల ఆదేశాలు, పర్యావరణం, కాంటూరు అంశాలపై సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. కాంటూరు పరిధి వల్ల 3 లక్షల మంది ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కొల్లేరు కాలుష్యం కాకుండా డ్రైన్ వాటర్‌కు ట్రీట్‌మెంట్ జరగాలన్నారు. కొల్లేరు నీటిని సముద్రంలోకి తీసుకెళ్లే ఉప్పుటేరులో ఆక్రమణలు తొలగించాల్సి ఉందన్నారు. కొల్లేరు పరిధిలో 20 వేల ఎకరాల జిరాయితీ, డీ పట్టా భూములు ఉన్నాయి. కాంటూరు సమస్య ఉన్నందున ముందుగా వీరికి న్యాయం జరిగేలా చూడాలి. రాష్ట్ర ప్రతిపాదనలను సీఈసీ, సుప్రీంకోర్టు ముందుంచి వారిని ఒప్పించాలి. పర్యావరణంతోపాటు- ప్రజలకూ న్యాయం జరిగేలా కార్యాచరణ ప్రారంభించాలి. కొల్లేరుపై కోర్టు తీర్పులు, నిబంధనలు, కేంద్ర సంస్థల ఆదేశాలు, స్థానిక పరిస్థితులు, పర్యావరణ, కాంటూరు అంశాలపై సీఎం చంద్రబాబు సచివాలయంలో సోమవారం సమీక్షించారు. కొల్లేరు పరిధిలో మూడు లక్షల మంది ప్రజలు ఉన్నారు... కొల్లేరు కాంటూరు పరిధి అంశంలో చాలా కాలంగా వీరు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీరి సమస్య పరిష్కారం కోసం 2014 నుంచి 2019 మధ్య నాటి తెలుగుదేశం ప్రభుత్వం చాలా ప్రయత్నాలు చేసింది. ఇందులో భాగంగా 2018లో నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు 20 వేల ఎకరాల జరాయితీ, డీ పట్టా భూములను కొల్లేరు పరిధి నుంచి మినహాయించి కొత్త సరిహద్దులను నిర్ధారించాలని చెప్పింది. ఈ మేరకు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి సిఫారసు కూడా చేసింది. అయితే దీనిపై కొందరు అభ్యంతరాలు చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ఎటు-వంటి ప్రయత్నమూ చేయలేదు. కొల్లేరు సమస్య పరిష్కారంపై పట్టు-దలగా ఉన్న కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఆ ప్రాంతం ఎమ్మెల్యేలతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...'కొల్లేరు కాలుష్య కాసారం కాకుండా చూడాలి. కొల్లేరులోకి వెళ్తున్న డ్రైన్ వాటర్‌కు ట్రీట్‌మెంట్ జరగాలి. విచ్చల విడిగా డ్రైన్లు వదిలేసి కొల్లేరును కాలుష్యమయం చేసే పక్రియకు బ్రేక్ పడాలి. డ్రైన్‌లో పూడికలు తొలగించాలి....నీరు సులువుగా వెళ్లే అవకాశం కల్పించాలి. కొల్లేరు నుంచి నీటిని సముద్రంలోకి తీసుకువెళ్లే ఉప్పుటేరు అక్రమణలను తొలగించాలి. ఉప్పుటేరు పూడిక తీసి, ఆక్రమణలు తొలగించి నీరు సముద్రంలోకి వెళ్లేలా చేయాలి. అవుట్ లెట్లు- పూర్తిగా క్లియర్ చేయాలి. ఈ పనులకు అవసరమైన అంచనాలు రూపొందించి పనులు ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కొల్లేరు రైతుల సమస్యలపై మాట్లాడుతూ.... 'కొల్లేరు పరిధిలో 20 వేల ఎకరాల జిరాయితీ, డీ పట్టా భూములు ఉన్నాయి. కాంటూరు సమస్య నేపథ్యంలో ముందుగా వీరికి న్యాయం జరిగేలా చూడాలి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సీఈసీని, సుప్రీంకోర్టు ముందు ఉంచి వారిని ఒప్పించాలి. పక్షులు, పర్యావరణంతో పాటు- ప్రజలకు కూడా న్యాయం జరిగేలా కార్యాచరణ ప్రారంభించాలని సీఎం చంద్రబాబు అన్నారు. సమీక్షకు చీఫ్ సెక్రటరీ విజయానంద్‌తో పాటు- అధికారులు, డిప్యూటీ-స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్ హాజరయ్యారు.

# తుని కేసును తిరగదోడే ఆలోచన లేదు

అమరావతి, తుని ఘటనలో నమోదైన కేసును తిరగదోడే ఉద్దేశం లేదని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. కేసును కొట్టివేస్తూ రైల్వే కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళ్లే యోచన లేదని తెలిపింది. తుని కేసును హైకోర్టులో అప్పీల్ చేయాలనే ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని అధికారులను ఆదేశించింది. విషయం ప్రభుత్వ పెద్దల దృష్టికి రాగానే అప్పీల్ ఆలోచన విరమించు కోవాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఏ స్థాయిలో ఆమోదంతో ఈ ఫైల్ నడిచిందనే అంశంపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. కేసుపై ఆర్పీఎఫ్ సీనియర్ డివిజినల్ సెక్యూరిటీ కమిషనర్ చేసిన ప్రతిపాదనల ఆధారంగా ఉత్తర్వులు వెలువడినట్లు అధికారులు గుర్తించారు. సున్నితమైన ఇలాంటి అంశాలపై అలసత్వాన్ని ఉపేక్షించేది లేదని అధికారులను ప్రభుత్వం హెచ్చరించింది. ప్రభుత్వ ఆదేశాలతో జీవోను రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువడనున్నట్లు సమాచారం. కేసుపై ఆర్పీజీ సీనియర్ డివిజినల్ సెక్యూరిటీ- కమిషనర్ చేసిన ప్రతిపాదనల ఆధారంగా ఉత్తర్వులు వెలువడినట్టు గుర్తించింది. ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని ప్రభుత్వం నుంచి అధికారులకు హెచ్చరికలు జారీ అయ్యాయి. దీనికి సంబంధించి ఎవరు బాధ్యులు అనేదానిపై పరిశీలన చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. తుని కేసును కొట్టివేస్తూ రైల్వే కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళ్లే ఆలోచన ప్రభుత్వానికి లేదు అని అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. తుని కేసును హైకోర్టులో అప్పీల్ చేయాలనే ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ఆదేశించారు.

## అమెరికాలో ఇబ్బంది పడితే చెప్పండి

హైదరాబాద్,అమెరికాలో వివిధ కారణాలతో ఇబ్బందులు పడే భారతీయ విద్యార్థులకు అండగా నిలబడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నో ఆశలతో ఉన్నత విద్య కోసం వచ్చిన విద్యార్థులు, అవగాహన లేక ఏమైనా తప్పు చేస్తే వారికి అవసరమైన న్యాయసహాయం అందించేందుకు బీఆర్ఎస్ అమెరికా విభాగం తరపున ప్రయత్నం చేస్తామని తెలిపారు. అమెరికా వచ్చిన విద్యార్థులు ఏదైనా కారణంతో తిరిగి వస్తే అతనితోపాటు వారి కుటుంబం ఎంతో ఆవేదనకు గురవుతుంద న్నారు చెప్పారు. అందుకే విద్యార్థులకు అండగా నిలబడేందుకు నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. అయితే విద్యార్థులు కూడా అమెరికా చట్టాలను, అక్కడి సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకొని మసులుకోవాలని సూచించారు. స్థానిక చట్టాలతో పాటు- ఇక్కడి పరిస్థితులను ప్రతీ ఒక్క విద్యార్థి అవగాహన చేసుకోవాలన్నారు. అమెరికాలోని డాలస్ పర్యటనలో ఉన్న కేటీఆర్.. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ డల్లాస్‌లో చదువుకుంటున్న విద్యార్థులతో మాట్లాడారు. వర్సిటీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా సమాజంలో, ప్రపంచంలో మంచి మార్పు తీసుకువచ్చే దిశగా ప్రయత్నం చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రపంచవ్యాప్తంగా గొప్ప ఆవిష్కరణలు వస్తున్నాయన్న కేటీఆర్, ఇన్నోవేషన్ రంగంలో ప్రపంచ దేశాలతో భారత్ పోటీపడి రాణించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికాలోని ఉన్నత విద్యా సంస్థల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. రిస్కు తీసుకున్నప్పుడు మాత్రమే కలలు సాకారం అవుతాయి అనడానికి కేసీఆర్ జీవితమే సాక్ష్యమని చెప్పారు. అమెరికా పోవాలన్నా, చదువు కోవాలన్నా ఎన్నో వ్యయ ప్రయాసలకు గురయ్యే వాళ్లమన్న కేటీఆర్.. ప్రపంచం వేగంగా మారిపోయి ఇప్పుడు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. దాంతోపాటే అమెరికా విద్య కూడా అనేకమందికి అందుబాటులోకి వచ్చిందన్నారు. కేవలం ర్యాంకుల కోసమో, గ్రేడ్ల కోసమో కాకుండా జీవితంలో సాధించాల్సిన ప్రధాన లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. చూస్తుండగానే మనిషి జీవితంలో 50 ఏండ్లు పూర్తవుతాయని ఇంత స్వల్ప కాలంలోనే తమ కలలు, ఆకాంక్షలను అందిపుచ్చుకోవాలన్నారు. లక్ష్యం వైపు సాగే క్రమంలో అవరోధాలు ఎదురైనా, తమతోనే ఉన్న వ్యక్తులు లాగినా నిబద్ధతతో ముందుకు పోవాలని చెప్పారు. రాజకీయాల్లో చిన్న వయసులో పరిగణించే నాలుగు పదుల వయసులో పదవులను త్యాగం చేశారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు- కోసం ఉద్యమం మొదలుపెట్టిన రోజు అనేకమంది ఆయనను అవహేళన చేశారని తెలిపారు. కానీ 14 సంవత్సరాల నిరంతర పోరాటం తర్వాత ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నప్పుడు సమాజంలోని ప్రతి ఒక్కరు కేసీఆర్‌పై ప్రశంసలు కురిపించారని చెప్పారు. అమెరికాలో చదువుకుని ఇండియాకి తిరిగి వచ్చి కంపెనీలు ప్రారంభించాలని విద్యార్థులను కోరారు. మనదేశంలో ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ అనేక అవకాశాలు కూడా ఉన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. మేథోవలస (ఐఎస ఉసఐ) మన దేశానికి పెను సవాలుగా మారిందని చెప్పారు. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో విదేశాల్లో చదువుకుంటున్న యువత భాగం కావాలని పిలుపునిచ్చారు. ఇకపోతే అక్కడ తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. దీనిలో భాగంగా డాలస్‌లో అమెరికాలోనే అతి పెద్దదైన మహాత్మాగాంధీ విగ్రహాన్ని సందర్శించారు. అక్కడ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహమే ఆయుధాలుగా భారతీయులందరినీ గాంధీ సమాయత్తం చేశారన్నారు. బ్రిటీష్ బానిస సంకెళ్ల నుంచి దేశాన్ని విడిపించి స్వాతంత్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా నేటికీ గాంధీని ప్రపంచిస్తున్నారని చెప్పారు. అలాంటి విశ్వమానవుడి విగ్రహాన్ని ఇంత పెద్ద ఎత్తున డాలస్‌లో నెలకొల్పడంలో మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.ప్రసాద్ తోటకూర, కార్యవర్గ సభ్యుల కృషిని కేటీఆర్ అభినందించారు.

## ప్రజలంటే జగన్‌కు అసహ్యం

అమరావతి,గంజాయి వ్యాపారులు, డ్రగ్ డీలర్లు, బ్లేడ్ బ్యాచ్‌లకు జగన్‌ను గౌరవ అధ్యక్షుడిగా నియమిస్తే బాగుంటుందేమో అని పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు ఎద్దేవా చేశారు. గంజాయి అమ్మడం, ఆడపిల్లలను వేధించడం నేరం కాదన్నట్లుగా జగన్ మాటలు ఉన్నాయన్నారు. తాజాగా జగన్ వ్యాఖ్యలపై స్పందించారు. గతంలో మతాల మధ్య విభేదాలు రెచ్చగొట్టారన్నారు. ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వని ప్రజలంటే జగన్ కి కోపం రోజురోజుకూ పెరిగిపోతోందని ఆరోపించారు. ప్రజల పట్ల జగన్మోహన్ రెడ్డికి విపరీతమైన అసహ్యం కలుగుతోందని విమర్శించారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తి రౌడీ షీటర్లు, చైన్ స్నాచర్లు, బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి వ్యాపారులకు మద్దతు ఇవ్వడం ఏమిటి? సభ్య సమాజం ఏమనుకుంటుందనే కనీస ఆలోచన జగన్‌కు లేదని మండిపడ్డారు. సమాజానికి ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నాడని ప్రశ్నించారు. జగన్‌కు రాజకీయ భవిష్యత్తు లేదని.. ప్రజాసేవకు పనికిరాడని ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు విమర్శించారు.రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణం జరిగింది. జగన్ సహచరులు, అనుచరులు, బంధువులు, మిత్రులు రాష్ట్రాన్ని దోచేశారు. కొందరు జైళ్లకు వెళ్తున్నారు. ఈ నేరాలకు సంబంధించిన ఆధారాలు అన్ని తాడేపల్లి ప్యాలెస్ వైపు చూపిస్తున్నాయి. తన పాలనలో జరిగిన నేరాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ చౌకబారు ఎత్తుగడలు వేస్తున్నారు. పోలీసులపై హత్యాయత్నం చేస్తే వారిని సమర్థించారు. తెనాలిలో పోలీసులు వల్ల పెద్ద నేరం జరిగినట్లు- మాట్లాడి, రౌడీలను పొగడడం జగన్‌కు సంస్కారం లేని తనాన్ని చూపిస్తుంది. గంజాయి విక్రయం, ఆడపిల్లల వేధింపు నేరాలు కాదన్నట్లు- ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి. చీరాలలో కిరణ్ కుమార్ అనే వ్యక్తిని మాస్క్ పెట్టుకోలేదని కొట్టి చంపారు. డాక్టర్ సుధాకర్‌ను మాస్క్ అడిగినందుకు నడిరోడ్డుపై దాడి చేసి చంపారు. గురజాలకు చెందిన దోమతోటి విక్రమ్‌ను హైదరాబాద్ నుంచి పిలిపించి వైసీపీ గూండాలు హత్య చేశారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజుని పోలీసులు కిరాతకంగా వేధించారు. ఇసుక దందా గురించి ప్రశ్నించిన వరప్రసాద్‌ను పోలీస్ స్టేషన్‌లో శిరోముండనం చేసి అవమానించారు. ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్ సుబ్రమణ్యంను హత్య చేసి, శవాన్ని డోర్ డెలివరీ చేశారు, కేసు పట్టించుకోలేదు. ప్రజలకు శాంతి భద్రతలు కల్పించడం, ఆడపిల్లల రక్షణ, గంజాయి నిర్మూలన కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. అయితే, జగన్ ఈ ప్రయత్నాలను అడ్డుకుంటు-న్నారు. గతంలో మతాల మధ్య, ఇప్పుడు కులాల మధ్య విభేదాలు రెచ్చగొడుతున్నారు. విజయసాయి రెడ్డి వంటి పాత ముద్దాయిలు పక్కకు వెళ్లిపోయారు, కొత్త వారిని చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే కుట్రలు, కుయుక్తులతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.

## హరీష్ వ్యాఖ్యలను ఖండించిన మంత్రి జూపల్లి

హైదరాబాద్, మిస్ వరల్డ్ పోటీలకు చాలా దేశాలతో పోటీపడి హైదరాబాద్ అవకాశం దక్కించుకుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. దీనిపై బిఆర్ఎస్ దుష్ప్రచారం చేయడం దారుణమని అన్నారు. ఈ పోటీలతో తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు, హస్తకళల గొప్పతనం ప్రపంచానికి తెలిసిందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జూపల్లి మాట్లాడారు. ఈ సందర్భంగా భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలపై మంత్రి స్పందించారు. భారాస చేసిన ప్రతి ఆరోపణపై బహిరంగ చర్చకు నేను సిద్ధం అని ప్రకటించారు.

## జగన్ రాంగ్ రూట్? వాళ్లు నేరస్తులని తెలిసి కూడా పబ్లిక్‌గా సపోర్ట్ ఎందుకు?

అమరావతి,రెడ్ బుక్, రెడ్ బుక్ అనుకుంటూ.. జగన్ పూర్తిగా ఆ మాయలో పడిపోయి ఏం చేస్తున్నారో కూడా అర్థం కాకుండా ప్రవర్తిస్తున్నట్టుంది. తాజాగా ఆయన తెనాలిలో పర్యటించారు. పోలీసుల చేతిలో దెబ్బలు తిన్న యువకుడి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు, వారిని ఓదార్చారు. తెనాలిలో జాన్ విక్టర్ కుటుంబాన్ని కలసి, పరామర్శించిన అనంతరం మీడియా ముందుకొచ్చి ప్రభుత్వంపై మండిపడ్డారు. పోలీసులతో కావాలనే ఆ యువకులను కొట్టించారని, ప్రభుత్వం తప్పు చేసిందంటూ ధ్వజమెత్తారు.

ఆ ముగ్గురు ఎవరు..?

తెనాలిలో ఇటీవల పోలీసులు బహిరంగంగా ముగ్గురు యువకులను లాఠీలతో చితకబాదిన విషయం తెలిసిందే. ఈ ఘటన బయటకొచ్చాక భిన్నరకాల ప్రతిస్పందనలు వచ్చాయి. ఆ యువకులు ఎలాంటి తప్పయినా చేయొచ్చు, కానీ పోలీసులకు వారిని బహిరంగంగా కొట్టే హక్కు లేదని కొంతమంది సామాజి ఉద్యమ నాయకులు వాదించారు. మరికొందరు వారు చేసిన తప్పుకి అలా బహిరంగంగా కొట్టడమే సరైన పని అని సమర్థించారు. ఇంకొందరు ఇక్కడ సామాజిక కోణం వెదికారు. వారిలో దళితులు ఉన్నారని. వారిని కొట్టడం సామాజిక న్యాయమేనా అన్నారు. సహజంగానా వేసీపీ ఈ ఘటనలో రెడ్ బుక్ ని తీసుకొచ్చింది. ఇక్కడ పోలీసుల చేతిలో దెబ్బలు తిన్నవారిలో ఎవరూ బుద్ధిమంతులు లేరు. పక్కా పోకిరీలు. వారిపై పాత కేసులు చాలానే ఉన్నాయి. అవి కూడా వైసీపీ హయాంలో నమోదయ్యాయి. ఆ కేసులకు ఈ ఘటనకు సంబంధమే లేదు. కానిస్టేబుల్ పై చేయి చేసుకున్నారనే కారణంతో ఆ ముగ్గురిని పోలీసులు చితక్కొట్టారు. ఆ తర్వాత రిమాండ్ కి పంపించారు. ఇక్కడ జగన్ ఓ లాజిక్ తీస్తున్నారు. తప్పు చేసినా సరే వారిని శిక్షించే అధికారం పోలీసులకు లేదంటున్నారు. పాత కేసులు ఉన్నంత మాత్రాన వారిని మరోసారి తప్పుడు కేసుల్లో ఇరికిస్తారా అంటున్నారు. తాజాగా తెనాలిలో జగన్ చేసిన వ్యాఖ్యలు మరింత సంచలనంగా మారాయి.జగన్ పరామర్శ వ్యవహారం వైసీపీని సమర్థించే వారికి కూడా నచ్చడం లేదంటే అతిశయోక్తి కాదు. తటస్థులు ఈ విషయంలో జగన్ కి చురకలంటిస్తున్నారు. నేరస్తులకు బహిరంగంగా మద్దతు తెలుపుతున్న



జగన్ ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారంటూ మండిపడ్డారు. అంటే ఈ ఘటనతో జగన్ సెల్ఫ్ గోల్ వేసుకున్నట్టు స్పష్టమవుతోంది.సాక్షాత్తూ హోం మంత్రి అనిత కూడా ఈ విషయంపై స్పందించారు. శాంతి భద్రతలకు సంబంధించిన అంశాన్ని జగన్ రాజకీయం చేస్తున్నారని అన్నారు. దళితులకు అన్యాయం జరిగిందని అందుకే పరామర్శించడానికి వస్తున్నానని చెప్పుకుంటున్న జగన్, తన హయాంలో దళితులను తప్పుడు కేసుల్లో ఇరికించి ఎందుకు హింసించాలని నిలదీస్తున్నారు. అప్పుడెందుకు జగన్ పరామర్శలకు రాలేదని ప్రశ్నిస్తున్నారు.

గంజాయి మామ..

జగన్ పరామర్శ ఘటనకు సంబంధించి ఆ ముగ్గురు పాత నేరస్తులపై గంజాయి కేసులు కూడా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. దీంతో టీడీపీ గంజాయి మామ అంటూ జగన్ పై ఓ ఎపిసోడే నడుపుతోంది. గంజాయి మామను స్థానికులు అడ్డుకున్నారంటూ వీడియోలు పోస్ట్ చేస్తోంది టీడీపీ.మొత్తమ్మీద ఈ ఎపిసోడ్ తో వైసీపీకి ఏమైనా లాభం ఉంటుందేమో తెలియదు కానీ, వ్యక్తిగతంగా జగన్ ని అభిమానించే కొంతమంది కూడా ఆయన వ్యవహార శైలిని తప్పుబడుతున్నారు. గంజాయి బ్యాచ్ కి జగన్ మద్దతేంటని లాజిక్ తీస్తున్నారు. నేరస్తులను కూడా సామాజిక వర్గాల వారీగా చూడాల్సిన దౌర్భాగ్యం జగన్ కి పట్టడమేంటని మండిపడుతున్నారు.

## వలసల పేరిట విలువలపై ఉక్కుపాదం!



న్యూఢిల్లీ,ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ నేతృత్వంలోని అసోం ప్రభుత్వం సరియైన పత్రాలు లేని విదేశీయులను బంగ్లాదేశీయులకు వెనక్కి పంపించే ప్రయత్నాలను ఇటీవల వేగవంతం చేసింది. విదేశీయులుగా ప్రకటించిన వారిని వెనక్కి పంపించేయాలని 2025 ఫిబ్రవరి 4న సుప్రీం కోర్టు సైతం సమర్థించిన ఈ విధానం బంగ్లాదేశ్ ప్రభుత్వంతో అధికారిక సమన్వయంతో అమలు చేయకపోవడం వల్ల తీవ్ర వివాదానికి దారితీస్తోంది. అంతేకాకుండా అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబడి ఉండకపోవడం వెనక్కి తిప్పి పంపించడానికి అసోం కేంద్రంగా ఎంచుకోవడం మానవత్వానికి సంబంధించి విస్తృతమైన పరిణామాలు ఈ ప్రాంతంలో ఉనికికి సంబంధించిన విధానాలపై ప్రశ్నలను కూడా లేవనెత్తుతున్నది. విదేశీ పౌరులు ముఖ్యంగా సరియైన పత్రాలులేని వలసదారులను తిప్పి పంపించడానికి అంతర్జాతీయ నిబంధనలు, సంప్రదాయాలు ఉన్నాయి.మానవ హక్కులు, గౌరవం, ద్వైపాక్షిక సహకారాలకు ఇవి ప్రాధాన్యత ఇస్తున్నాయి. 1951 నాటి శరణార్థుల ఒప్పందం, అలాగే 1967 నాటి దాని ప్రోటోకాల్ భారత్‌కు వర్తించవు. ఎందుకంటే వాటిపై అది సంతకం చేయలేదు. వేధింపులు, చిత్రహింసలు లేదా ప్రాణహాని ప్రమాదాలు ఎదుర్కొనే దేశాలకు శరణార్థులను తిప్పి పంపరాదని ఈ ఒప్పందంలో ఉద్దేశిస్తున్నాయి. అలాగే అంతర్జాతీయ మానవ హక్కుల డిక్లరేషన్ (1948), పౌర రాజకీయ హక్కులకు సంబంధించిన అంతర్జాతీయ ఒడంబడిక( %×అ-వతీఅఫ్‌ఆశీఖుశ్రీ తీమఫ్ఎ%) (1966) కూడా జీవించే హక్కు, స్వేచ్ఛ, ఏకపక్ష నిర్బంధంనుంచి రక్షణను నొక్కి చెబుతున్నాయి. సరియైన పత్రాలు లేని వారికి కూడా ఇవి వర్తిస్తాయి.చట్టబద్ధమైన తరలింపునకు కొన్ని అంతర్జాతీయ నిబంధనలు ఉన్నాయి.అవేమిటంటే ఏ వ్యక్తినైతే వెనక్కి పంపిస్తున్నారో అతని జాతీయతను సంబంధిత దేశంతో దౌత్యమార్గాల ద్వారా ధ్రువీకరించుకోవాలి. అలాగే తమను విదేశీయులుగా ప్రకటించడంపై అప్పీలు చేసుకునే హక్కుతోపాటుగా న్యాయపరమైన చర్యలకు వలసదారులకు అవకాశం ఉండాలి. చివరగా వలసదారుల తరలింపు అనేది వారిని స్వీకరించే దేశంతో సమన్వయంతో పాటుగా వారి రక్షణ, గౌరవప్రదమైన తరలింపును కలిగి ఉండాలి. అలాగే వలసదారులను జనసంచారం లేని ప్రాంతాలు లేదా ఘర్షణలు జరిగే ప్రాంతాల్లో వదిలేయడం లాంటివి లేకుండా తరలింపు ఉండాలి. అయితే భారత దేశం అనుసరిస్తున్న వలసదారులను వెనక్కి పంపించే విధానం ఈ నిబంధనలకు భిన్నంగా ఉంది.వలసదారుల తరలింపునకు సంబంధించి అధికార ఒప్పందాలు లేకుండా భారత్ బంగ్లాదేశ్ సరిహద్దు గుండా జనాన్ని బలవంతంగా తరలించడం ద్వారా భారత్ ప్రాణహాని ఉన్న దేశానికి వ్యక్తిని తిప్పి పంపకూడదన్న సూత్రాన్ని ఉల్లంఘించడమే కాకుండా మానవతా సంక్షోభాన్ని సృష్టిస్తోంది. ఈ విధానంపై 2025 మే 8న ఆందోళన వ్యక్తం చేసిన బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ తరలింపునకు సంబంధించిన నిబంధనలకు కట్టుబడి ఉండాలని భారత్ విజ్ఞప్తి చేసింది. పారదర్శకత, సమన్వయం లేకపోవడంతోపాటు వెనక్కి తిప్పి పంపేవారిని కళ్లకు గంతలు కట్టడం, చేతులకు బేడీలు వేయడం వంటివి చేస్తున్నారన్న వార్తలు మానవ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని విమర్శలకు కారణమవుతున్నాయి. జనసంచారం లేని ప్రాంతంలోకి వ్యక్తులను బలవంతంగా తరలించడం మానవ హక్కులకు వ్యతిరేకమని ఎందుకంటే అవి వారి ప్రాణాలకు ముప్పు కావడమే కాకుండా దౌత్యపరమైన ఒడంబడికలకు వ్యతిరేకమని అసోం విదేశీ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు శిశిల్‌డే అంటున్నారు.ఢిల్లీ, గుజరాత్, రాజస్తాన్ లాంటి రాష్ట్రాల నుంచి సరియైన పత్రాలులేని వలసదారులను బంగ్లాదేశ్‌తో విశాలమైన సరిహద్దు కలిగి ఉన్న పశ్చిమ బెంగాల్ ద్వారా కాకుండా అసోం, త్రిపుర మార్గాల ద్వారా వెనక్కి పంపించాలన్న నిర్ణయం గందరగోళానికి దారి తీయడమేకాకుండా రాజకీయ రవాణాపరమైన ఆలోచనతో తీసుకున్న నిర్ణయంగా కనిపిస్తోంది. ఎందుకంటే 1970 దశకం నుంచి కూడా దేశం లో జరిగిన విదేశీ వ్యతిరేక ఉద్యమానికి అసోం కేంద్రంగా ఉంది. పౌర సత్వానికి కటాఫ్ తేదీగా 1971 మార్చి 25ను నిర్ణయించడమే బంగ్లాదేశ్ నుంచి వలసల విషయంలో ఈ రాష్ట్రం చారిత్రకంగా ఎంత సున్నితంగా ఉందో అర్థమవుతోంది.

ఇక రవాణా పరంగా చూస్తే సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్)తో సమన్వయం లాంటి వాటితో పాటుగా అసోం, త్రిపుర సరిహద్దులు వలసదారులను తిప్పి పంపే ఆపరేషన్లకు ఎక్కువ అనుకూలంగా ఉంటాయి. అంతేకాకుండా అసోం, త్రిపురలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాలు కూడా అక్రమ వలసదారులను వేగంగా గుర్తించి వెనక్కి పంపించడానికి ప్రాధాన్యత ఇస్తున్నది. దీనికి భిన్నంగా తృణమూల్ కాంగ్రెస్ పాలనలోని పశ్చిమ బెంగాల్ వలసల విషయంలో మరింత సంక్లిష్టమైన రాజకీయ వైఖరిని అవలంబిస్తోంది.బంగ్లాదేశ్ ప్రాంతానికి చెందని వారితో పాటుగా రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న బెంగాలీ మాట్లాడే వారిని బెంగాలీ వ్యతిరేకులుగా ముద్ర వేయడాన్ని, బలవంతంగా వారిని వెనక్కి పంపించే విధానాలకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మొదటి నుంచి వ్యతిరేకమనే విషయం తెలిసిందే. ఈ రాజకీయ భిన్నవైఖరి కారణంగానే పశ్చిమ బెంగాల్ కాకుండా అసోం, త్రిపురలను వలసదారులను వెనక్కి పంపించడానికి ఎంచుకోవడానికి కారణమైందని అర్థమవుతోంది. అయితే ఈ వైఖరి రవాణా పరమైన, నైతికపరమైన సమస్యలను లేవనెత్తుతోంది. 2025 మే 25న ఘజియాబాద్ నుంచి అగర్తలకు సైనిక విమానం ద్వారా 160 మంది వలసదారులను తరలించడం లాంటి ఘటనలు ఆందోళన, అస్పష్టతలను కలిగిస్తున్నాయి. నిర్బంధంలో ఉన్న వారెక్కడున్నారనే దానిపై తనకేమీ తెలియడం లేదని వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేయడం మానవ హక్కులపరమైన సమస్యలకు అద్దం పడుతున్నాయి.వలసదారులను కళ్లకు గంతలు కట్టి, చేతులకు బేడీలు వేసి జనసంచారంలేని ప్రాంతంలో లేదా సుందర్బ న్స్ లాంటి ప్రమాదకరమైన ప్రాంతాల్లో వదిలేస్తున్నట్టు వస్తున్న వార్తలు ఈ ప్రక్రియ ఎంత అమానుషంగా జరుగుతోందో ఎత్తిచూపుతోంది. మయన్మార్‌నుంచి నిర్దాక్షిణ్యంగా తరిమివేయబడ్డ రోహింగ్యాలు కూడా వీరిలో ఉండడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఎందుకంటే వారు స్వదేశానికి తిరిగి వెళ్లిన తర్వాత తీవ్రమైన వేధింపులు, చిత్రహింసలకు గురయ్యే ప్రమాదం ఉంది. 40 మంది రోహింగ్యాలను అండమాన్ నికోబార్ దీవులకు విమానంలో తీసుకు వచ్చి మయన్మార్ సమీపంలోని సముద్రం వద్ద వదిలేశారని, ట్రంప్ తరహా క్రూరత్వ విధానంతో పోలుస్తూ తీవ్ర వార్త ఆరోపించింది. విచక్షణారహితంగా అమలు చేసే విధానంలో భారతీయ పౌరులను కూడా విదేశీయులుగా తప్పుగా గుర్తించే ప్రమాదం కూడా ఉంది. అసోంలో 'మియా'గా ముద్రపడిన బెంగాలీ మాట్లాడే ముస్లింలు ఓటరు గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డులు లాంటి సరైన పత్రాలు కలిగి ఉన్నప్పటికీ వేధింపులకు గురి అవుతున్నారు.ఈ ప్రక్రియ దేశచట్టాలను బేఖాతరు చేయడం. అట్టడుగు వర్గాల కష్టాలను మరింత ఎక్కువ చేసేదిగా ఉంది. అసోం వలసల విషయంలో బిజెపి వైఖరి దాని హిందూ జాతీయతా విధానానికి అద్దం పడుతున్నది. ముస్లింలు ముఖ్యంగా బంగ్లాదేశ్ ప్రాంతానికి చెందిన వారిని 'చొరబాటుదారులు' గా దేశ భద్రత, హిందూ ఉనికికి ముప్పుగా అది అభివర్ణిస్తోంది. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) కింద హిందువుల పట్ల ఉదారత చూపడం, మరోవైపు ముస్లిం వలసదారులను మనుషుల కన్నా తక్కువగా చూడడం, వారిని 'చెదపురుగులు'గా అభివర్ణిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా 2018లో చేసిన వ్యాఖ్యలు దీనికి నిదర్శనం. 2014కు ముందు రాష్ట్రంలో ప్రవేశించిన హిందూ బంగ్లాదేశీయులపై ఎలాంటి చర్యా ఉండబోదంటూ అసోం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ చేసిన ప్రకటన సైతం ఈ మతపరమైన వివక్షను నెత్తికెత్తుతోంది. ఇది మతంతో సంబంధం లేకుండా అన్ని వలసలను వ్యతిరేకించే అసోం జాతీయ వాదుల వైఖరికి భిన్నమైనవి.ఈ మతతత్వ ముద్ర ఎన్నికల ప్రయోజనాలకు పనికి వస్తుంది. 2016లో అసోం అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ముస్లిం 'చొరబాట్ల' భయాన్ని జనంలో కలిగించడం ద్వారా పరిపాలన సవాళ్ల నుంచి వారి దృష్టిని మళ్లించాలని బిజెపి అనుకుంటోంది. అయితే దీని వల్ల స్థానిక అసోమీ ఓటర్లు దూరమయ్యే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ఈ విధానం భారత్ బంగ్లాదేశ్ సంబంధాలను మరింత దెబ్బ తీసే ప్రమాదం ఉంది. బంగ్లాదేశ్ సరిహద్దులకు ఆనుకొని వున్న ప్రాంతాలు ముఖ్యంగా ధుబ్రి, నాగావ్, మోరీగావ్, బార్‌పేట, సల్మారా మంతకార్, గోల్‌పారా జిల్లాలోని స్థానికంగా నివాసమున్న భారతీయ పౌరులకు ఆయుధాల లైసెన్స్ మంజూరు చేయాలని గత మే 28న అసోం మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయం తీవ్రమైన చర్చను రగిలించింది. ఈ విధానం బెంగాలీ మాట్లాడే ముస్లింలు, చాలా వరకు బంగ్లాదేశ్ ప్రాంతానికి చెందినవారే మెజారిటీగా వున్న ప్రాంతాలు స్థానిక అసోమీ ప్రజలు మైనారిటీగా ఉన్న ప్రాంతాలను టార్గెట్ చేస్తోంది. ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో అశాంతి వలసదారులను వెనక్కి పంపించేందుకు అసోం చేపట్టిన ప్రయత్నాల కారణంగా ఈ వర్గాలు అభద్రతా భావాన్ని ఎదుర్కొంటున్నాయని బిశ్వ శర్మ భావిస్తున్నారు. 1959 నాటి ఆయుధాల చట్టం, 2016 ఆయుధాల నిబంధనలు ఈ విధానానికి మూలం. ఈ విధానం పౌరులను సాయుధులుగా మార్చడానికి సంబంధించినది కాదని 1979 1985 మధ్య జరిగిన ఒకప్పటి అసోం ఆందోళన నాటి డిమాండ్‌ను నెరవేర్చడమని శర్మ

## నేరగాళ్లకు మాజీ సీఎం జగన్ పరామర్శలా

అమరావతి,నేరగాళ్లకు మాజీ సీఎం జగన్ పరామర్శ.. దిగజారుడు ఓట్ల రాజకీయానికి పరాకాష్ఠ అని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. గంజాయి బ్యాచ్ సానుభూతి పలకడం బాధాకరమని రఘురామకృష్ణంరాజు అన్నారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో ఆత్మహత్యలే తప్ప హత్యలుండవు అనే సామెత జగన్‌లాంటి వారిని చూసే వచ్చింది. గంజాయి బ్యాచ్‌ను పరామర్శించి రాజకీయంగా ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులపై హత్యాయత్నం చేసిన నిందితులకు జగన్ అండదండలా? నాడు ఎంపీగా ఉన్నప్పుడు అప్పటి అధికారి సునీల్‌కుమార్‌తో నన్ను కస్టడీలో కొట్టించింది జగనే. ఆయన్ను చూసి జాలిపడటం తప్ప ఇంకేమీ చేయలేం అని రఘురామ ఎద్దేవా చేశారు. అరాచకాలు చేసినవారికి జగన్ మద్దతివ్వడం దారుణమని చెప్పారు. డాక్టర్ సుధాకర్‌ను జగన్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. తనకు ఓటేయని ప్రజలపై వైసీపీ వెన్నుపోటు- దినోత్సవం చేస్తోందని ధ్వజమెత్తారు. హెల్త్ కార్డ్ కోసం కొంతమంది నకిలీ ధ్రువపత్రాలు ఇచ్చి మరి తెల్లరేషన్ కార్డు తీసుకుంటున్నారని.. అలా చేయొద్దని రఘురామకృష్ణంరాజు కోరారు. హెల్త్ కార్డ్ ఉన్న ప్రతి పౌరుడికి రూ. 25 లక్షలు కవరయ్యేలా చూడాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోందని రఘురామకృష్ణంరాజు చెప్పారు. ముందు తమ కమిటీ రిపోర్ట్‌ని అసెంబ్లీ స్పీకర్‌కు ఇస్తామని వెల్లడించారు. అవసరం లేకుండా కొంతమంది రేషన్ తీసుకోవడం వల్లే బియ్యం స్మగ్లింగ్ జరుగుతుందని అన్నారు. ఇప్పుడు కోటి 40 లక్షలు మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని వివరించారు. ఏపీలో మొత్తం కోటి 70 లక్షల కుటుంబాల్లో.. కోటి 40 లక్షలు బీపీఎల్ కిందే ఉన్నారనే విషయాన్ని నమ్మడం కష్టమని అన్నారు. రేషన్ అవసరం లేని వారు స్వచ్ఛందంగా ముందుకు వస్తే వారికి హెల్త్‌కార్డ్‌లో భాగంగా రూ. 25 లక్షలు కవరయ్యేలా చేస్తామని వివరించారు రఘురామకృష్ణంరాజు.ఏపీ ప్రభుత్వం రేషన్‌కు రూ.5, 100 కోట్లు- ఇస్తోందని.. ఇందులో రూ. 2000 కోట్లు- రేషన్‌లో మిగిలితే ఆ మొత్తం విద్యాశాఖకు ఖర్చు పెడితే నాణ్యమైన విద్యా లభిస్తుందని రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించారు. హెల్త్ కార్డ్, రేషన్ కార్డు, పెన్షన్ కార్డులను వేర్వేరుగా ఇస్తే ఎలా ఉంటుందనే విషయాన్ని తమ కమిటీ- ఆలోచించిందని చెప్పారు. ఈ విషయాన్ని అసెంబ్లీ స్పీకర్ ద్వారా ఏపీ ప్రభుత్వానికి అందించాలని నిర్ణయించామని తెలిపారు. 15 రోజులకు ఒకసారి తమ కమిటీ సమావేశం అవ్వాలని నిర్ణయించామని చెప్పారు. గత జగన్ ప్రభుత్వంలో పిటీ-షన్ కమిటీ- ఒక్కసారి కూడా సమావేశం కాలేదని అన్నారు. రేషన్ అవసరం లేకపోతే ఆ మేరకు నగదు బదిలీపై చర్చిస్తున్నామని తెలిపారు. కోటి 46 లక్షల రేషన్ కార్డులకు నగదు ఇస్తే ధాన్యం ఎవరు కొంటారని ప్రశ్నించారు. బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇస్తే ధాన్యం కొనరా అని అడిగారు. రేషన్ షాప్‌లో రేషన్ మాత్రమే కాకుండా అన్ని ప్రొవిజన్‌లు ఉండేలా చూసే ఆలోచన కూడా ఉందని అన్నారు. ఇప్పుడు అవసరం ఉన్న వారికి రేషన్ ఇంటి డెలివరీ అవుతుందని రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు.

## అన్ని ప్రాంతాల్లో సమగ్రాభివృద్ధి

విజయవాడ, సమాజంలో అన్ని తరగతుల ప్రజలు, వివిధ సామాజిక వర్గాలు అభివృద్ధి చెందితే సమ్మిళిత అభివృద్ధి అవుతుంది. అన్నివర్గాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి. ముఖ్యంగా కేవలం పెన్షన్ల పంపిణీ, కిలో రూపాయి బియ్యం వంటివే అభివృద్ధి కావు. ఇవి ఓ రకంగా అభివృద్ధిని దెబ్బతీసేవిగానే చూడాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధి జరిగినప్పుడే ఆర్థిక పురోగతి సాధ్యం. ఆంధ్రప్రదేశ్‌లో 17 శాతం దళితులు, 6 శాతం గిరిజనులు, 9 శాతం మైనారిటీలు, 47 శాతం బి.సిలు ఉన్నారు. సబ్‌ప్లాన్ ఉన్నప్పటికి దళితులు, గిరిజనుల అభివృద్ధి ఆశించిన విధంగా లేదు. డెల్టా ప్రాంతాలలో దళితులకు కనీసం స్మశానాలు కూడా లేని ఎన్నో గ్రామాలు ఉన్నాయి. గిరిజన ప్రాంతాలలో వైద్య సదుపాయాలు అందక కిలోమీటర్ల దూరం నడచి వెళుతున్నారు. ఇవన్నీ పట్టింపులేని అంశాలుగా మారాయని లెఫ్ట్ నేతలు మండిపడుతున్నారు. ÷ూష్ట్రంలో సహజ వనరులను ఉపయోగించుకొని సుస్థిర అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని సిపిఐ నేత రామకృష్ణ అన్నారు. సహజ వనరులు దోపిడీ చేయడానికి అభివృద్ధి పేరుతో పర్యావరణ విధ్వంసానికి ప్రయత్నం జరుగుతున్నది. రాష్ట్రంలో కడప జిల్లాతో సహా అనేక ప్రాంతాలలో జరుగుతున్న మట్టి,యేరునియం తవ్వకాలు దీనికి ఒక ఉదాహరణ. ఉత్తరాంధ్రలో బాక్సైట్ గనులను దోపిడీ చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇసుక మాఫియా ప్రకృతిని, నదులను నాశనం చేస్తున్నది. అటవీ ప్రాంతాన్ని విధ్వంసం చేస్తున్నారు. రాష్ట్రంలో అటవీ ప్రాంతం 19 శాతం మాత్రమే ఉన్నది. పర్యావరణ సమతుల్యానికి 33 శాతం అడవులు అవసరం. ప్రకృతి వనరులను కాపాడుకొంటూ భావితరాలకు ఉపయోగపడే విధంగా సుస్థిర అభివృద్ధి కొనసాగించాలి. భూసమస్యలపై నియమించిన కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు జరగలేదు. భూ కేంద్రీకరణ కొనసాగుతూనే ఉన్నది. భూ పంపిణీ గురించి ప్రభుత్వాలు మాట్లాడడం లేదు. ల్గ÷తు ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. ఆత్మహత్యలు చేసుకున్న వారిలో కౌలు రైతులే ఎక్కువ. 2011లో చేసిన కౌలు రైతుల రక్షణ చట్టం కౌలు రైతుల ప్రయోజనాలను కాపాడలేక పోయింది. భూయజమానులు కౌలు రైతులతో రాత పూర్వక ఒప్పందానికి సిద్ధంగా లేరు. రైతు భరోసా పథకం కూడా కౌలు రైతులకు ఉపయోగకరంగా లేదు. దళితులు, గిరిజనులు మొదలగు సామాజిక వర్గాల అభివృద్ధి భూ సమస్యతో ముడిపడి ఉన్నది. విద్యారంగంలో రెండు సమాంతర వ్యవస్థలు కొనసాగుతున్నాయి. బడికి వెళ్లే 70 లక్షల మంది పిల్లలలో 38 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలలో, 32 లక్షల మంది ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్ట పరచాలి. 'అమ్మ ఒడి' వంటి పథకాలు విద్యా రంగంలో మౌలిక మార్పులకు దోహదపడవు. ఉన్నత విద్యారంగం, ఇంటర్ విద్యను మార్కెట్ శక్తుల నుంచి విముక్తి చేయాలన్న సూచనలు ఉన్నాయి. వైద్య, ఆరోగ్య రంగంలో రాష్ట్రంలో 1134 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 21 బోధన ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు పని చేస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులలో మౌలిక వసతులు, డాక్టర్ల కొరత సమస్యలు వున్నాయి. ఆరోగ్యశ్రీ ఉన్నప్పటికీ ప్రజలకు ఉపశమనం లేదు. ప్రభుత్వం ఆస్పత్రులను పటిష్ట పరచాల్సి ఉంది. ÷ూష్ట్రంలో సమగ్రాభివృద్ధి సాధించాలంటే వివిధ ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలి.

## తొలకరితో సాగుకు రైతుల సన్నద్ధం

కర్నూలు,ఖరీఫ్ సీజన్ ఈ నెల నుంచే ప్రారంభం అవుతుంది. తొలకరి వర్షాలు పడడంతో రైతులు ఖరీఫ్ సేద్యాన్ని ప్రారంభించేందుకు రంగంలోకి దిగారు. ఇంకా ధాన్యం అమ్ముడు పని రైతులు అలు అసవ్థలు పడుతూనే కొత్త సాగుకు సిద్ధపడుతున్నారు. పంటల సాగు నిమిత్తం పెట్టుబడుల కోసం రైతుల వేట ప్రారంభం అవుతుంది.ఖరీఫ్ సీజన్ ఒకే సారి ప్రారంభం కావడంతో రైతులకు ఏటా భారం పడుతుంది. వ్యవసాయానికి సంబంధించి జూన్ నెల రైతులను కలవర పెడుతుంది. ఖరీఫ్ సీజన్ ఈ సమయంలోనే ప్రాంభం అవుతుంది. తొలకరి చినుకుల రాకతో పొలం పనులు ప్రారంభం అవుతాయి. ఇప్పటికే కురిసిన ముందస్తు వర్షాలతో రైతులు వేసవి దుక్కుల పనుల్లో నిమగం అయ్యారు. రాయలసీమలో సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలకు సంబంధించి రిజిస్ట్రేషన్

# కేసీఆర్‌కి జగన్ అంటే అంత ప్రేమ ఎందుకో తెలుసా?



హైదరాబాద్,రెండు పార్టీలు రెండు తెలంగాణ తల్లి విగ్రహాలు, రెండు జాతీయ గీతాలంటూ తీవ్రంగా కొట్టుకు ఛస్తున్నాయి కదూ. అయితే వీరు పెట్టుకుని నిజానికి పెట్టుకోవల్సింది వైయస్ విగ్రహానికి. వైయస్ ఆనాడు చంద్రబాబును ఏమీ చేయలేక.. చిన్నారెడ్డి అనే ఒక కాంగ్రెస్ నాయకుడి ద్వారా నలభై మంది వరకూ పోగేసి.. ఢిల్లీకి పంపారు. పర్పస్.. పాతబడిన తెలంగాణ ఉద్యమాన్ని తిరిగి రీయాక్టివేట్ చేయడానికి. అలా ప్రాంతీయ వాదాన్ని అడ్డు పెట్టుకుని చంద్రబాబును దెబ్బ తీసే యత్నం చేశారు. ఆ తర్వాత చంద్రబాబు ఓడిపోవడం వైయస్ అధికారంలోకి రావడం తెలిసిందే. అప్పటికి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి స్థాపించారు. కానీ ఏమంత ప్రోత్సాహకరంగా లేదు. ఈ విషయం పసిగట్టిన వైయస్, చిన్నారెడ్డి రూపంలో ఢిల్లీకి తెలంగాణ వాదం వినిపించేందుకు పంపారు. తర్వాతి కాలంలో కూడా ఆయన తెలంగాణ వాదులను చాలా రకాలుగా విమర్శించి వేధించేవారు. స్వయంగా కేసీఆర్ ను "నీకు బాబుగానీ మంత్రి పదవి ఇచ్చి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదంటూ" తీవ్ర అవమానకరమైన కామెంట్లు చేసేవారు. 'ఏవయ్యా రాజేంద్రా!' అంటూ ఆయన చేసిన కామెంట్లు ఇప్పటికీ చాలా మంది చెవుల్లో మారు మోగుతున్నాయి కూడా. ఒక పక్క తెలంగాణ కోసం చిన్నారెడ్డిలాంటి వాళ్లను రెచ్చగొట్టిన వైయస్ సరిగ్గా అదే సమయంలో.. తెలంగాణ రాకుండా అడ్డుకున్నట్టు కూడా చెబుతారు. 2009 ఎన్నికల సమయంలో "తెలంగాణకు వెళ్లాలంటే వచ్చే రోజుల్లో పాస్ పోర్టు అవసరమంటూ" వివాదాస్పద వ్యాఖ్యలను చేసి.. తర్వాత గెలిచిన ఘన చరిత్ర వైయస్ ది. అంతగా తెలంగాణ వాదంతో ఆడుకున్న వ్యక్తి వైయస్. ఎప్పుడైతే వైయస్ మరణించారో అప్పుడు తెలంగాణ వాదానికి ఊపిరి తీసుకున్న పరిస్థితి. ఒక సమయంలో వైయస్ ఉండగా తమకిక తెలంగాణ వచ్చే ప్రసక్తే లేదన్న కోణంలో కొందరు తీవ్రంగా ఫీలయ్యేవారు కూడా. అప్పట్లో కాంగ్రెస్ పార్టీలో వైయస్ కి అంతటి గ్రిప్ ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద ఎత్తున ఎంపీలను ఇచ్చే సీఎం కావడంతో.. ఢిల్లీ అధిష్టానం కూడా వైయస్ మాట జవదాటేది కాదు. ఇటు సీట్లు, అటు నోట్ల కట్టలతో వైయస్ ఢిల్లీ పెద్దల దగ్గర అంతగా తన మాట నెగ్గించుకునేవారు. అందుకే "వైయస్ చచ్చి ఏ లోకాన ఉన్నారో కానీ.." అంటూ కేసీఆర్ తరచూ అంటుండేవారు. అయితే ఇక్కడ వైయస్ తెలివి ఏంటంటే తెలంగాణ సెంటిమెంటు అడ్డు పెట్టుకుని.. ఢిల్లీ పెద్దలను గట్టిగానే గ్రిప్ లో పెట్టుకునేవారు. ఒక సమయంలో వైయస్ వల్లే విపరీతంగా బలిదానాలు జరిగాయన్న మాట వినిపించేది. వైయస్ మరణానంతరం కాస్త తెరిపిన పడ్డారు తెలంగాణ వాదులు. అంతగా ఆయన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దారుణంగా అడ్డుకున్నారు. వైయస్ మరణానంతరం.. అంటే 2014లో తెలంగాణ రావడంతో.. పాత కక్షలన్నీ మరచి పోయి.. వైయస్ ని కేసీఆర్ గౌరవించేవారని అంటారు. అంతే కాదు ఆయన కొడుకు జగన్ సైతం తెలంగాణ రాకను రాజకీయంగా అంగీకరించేవారు కాదు. దానికి తోడు ఈ ప్రాంతంలో కేసీఆర్ కి అడ్డుగా తన పార్టీని లేకుండా సమూలంగా తొలగించి.. ఏపీకి తన రాజకీయాలను పరిమితం చేశారు. దీంతో వైయస్ అన్నా, ఆయన కొడుకు జగన్ అన్నా.. కేసీఆర్ కి వల్లమాలిన అభిమానం. ఒక దశలో జగన్, షర్మిళ ఆస్తి పంపకాల పంచాయితీ కూడా కేసీఆర్ దగ్గరకే వచ్చింది. అలా కేసీఆర్, జగన్ ఇరువురు నేతలు రెండు ప్రాంతాలను చీల్చుకుని.. వాటి ద్వారా అధికారంలోకి రావడంతో.. ఇద్దరి మధ్య సత్సంబంధాలతో పాటు.. కొన్ని కొన్ని ఒప్పందాలు జరిగి ఎవరికి సాగినంతగా వారు సాగించుకున్నట్టు చెబుతారు. వైయస్ తన రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ వాదాన్ని వాడుకోవడం. ఆయన అడ్డుకోవడం వల్ల యువత బలవన్మరణాలకు పాల్పడ్డంతో ఉద్యమానికి మరింత ఊపొచ్చిందని నమ్ముతారు కేసీఆర్. దీంతో ఆయన వైయస్ ఫ్యామిలీ అంటే అంతటి అభిమానం చూపుతారని అంటారు

# బీజేపీకి రాజా సింగ్ గుడ్ బై?



హైదరాబాద్, క్రమశిక్షణకు మారుపేరైన ఆ పార్టీకి కొరకరాని కొయ్య ఆ నేత. తన మాటలతోనే మంటలను రాజేస్తూ.. సొంత పార్టీ నేతలనే ఉక్కిరి బిక్కిరి చేయడం ఆయనకే చెల్లింది. ఒకసారి మేకప్‌మెన్స్ అంటారు. మరోసారి కుర్చీలు తుడిస్తే పదవులు వస్తాయంటారు. మరోసారి తనకు వ్యతిరేకంగా దొంగలంతా ఏకమయ్యాయంటారు. ఇక ఈసారి మాత్రం మరో అడుగు ముందుకేసి సొంత పార్టీ నేతలను ఏకంగా ట్రాన్స్‌జెండర్లతో పోల్చేశారు. ఇలా చాన్స్ దొరికిన ప్రతిసారీ బీజేపీ దుమ్ము దులుపుతున్న ఆ నేత ఎవరు? అలాంటి నేతపై ఆ పార్టీ ధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకోబోతుంది?

**కాంట్రవర్సీకి బ్రాండ్ అంబాసిడర్‌గా బాగా పాపులర్**

రాజాసింగ్.. ఈ పేరుకు ఎవరికి పెద్దగా పరిచయం అక్కర్లేదు. కాంట్రవర్సీకి బ్రాండ్ అంబాసిడర్ బాగా పాపులర్ అయ్యారు. నిత్యం సొంత పార్టీ నేతలపై కామెంట్స్ చేస్తూ వివాదస్పద వాఖ్యలకు అడ్రస్‌గా నిలుస్తున్నారనే టాక్ నడుస్తోంది. ఇక హిందుత్వాన్ని తానే రక్షిస్తున్నాననీ, తానే హిందుత్వాన్ని, హిందూ ధర్మాన్ని భుజస్కంధాలపై మోసుకుతిరుగుతున్నాననీ, రాజాసింగ్ లేకపోతే హిందుత్వమే లేదు, బీజేపీకి మనుగడే లేదు అన్నంత రేంజ్‌లో ఉంటుంది ఆయన తీరు. ఆ బుసలతోనే గతంలో మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వాఖ్యలు చేసి పార్టీ నుంచి సస్పెండ్ అయ్యేదాక తెచ్చుకున్నారనీ పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారు. మహమ్మద్ ప్రవక్తపై వాఖ్యలు చేస్తే సస్పెండ్ చేసిన పార్టీ అధిష్టానం.. ఇప్పుడు ఏకంగా సొంత పార్టీ నేతలపైనే తీవ్ర వ్యాఖ్యలు చేస్తే క్షమిస్తుందా? అనేది ఇప్పుడు ఇంట్రెస్టింగ్‌గా మారింది.

**బీఆర్ఎస్‌తో కుమ్మక్కయ్యారంటూ ఆరోపణలు**

సొంత పార్టీ నేతలను టార్గెట్ చేస్తూ రాజాసింగ్ చేస్తున్న కామెంట్లకు నేతలంతా మౌనం వహిస్తున్నారు. దొంగలంతా ఒక్కటయ్యారు అన్నా పార్టీ నేతలు ఓర్చుకున్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌తో కుమ్మక్కయ్యారంటూ ఆరోపించారు. అయినా ఓపికతో ఉన్నారు. ఆ తర్వాత ప్యాకేజీలకు అమ్ముడుపోయే ద్రోహులు అంటూ విమర్శించారు. అయినా సహనంతో ఉన్నారు. ఇక ఆఖరికి టికెట్టు అమ్ముకునే చోరులు అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. సరే తమ పార్టీ నేతనే కదా అనుకున్నారు. ఇక రీసెంట్‌గా బీజేపీ, బీఆర్ఎస్ విలీనం విషయంలో కల్వకుంట్ల కవిత కామెంట్లకు మద్దతుగా నిలిచారు. సరే విషయాలు పూర్తిగా తెలియదులే అనుకున్నారు. కానీ ఇప్పుడు సొంత పార్టీ నేతలను ఏకంగా ట్రాన్స్ జెండర్లతో పోల్చడంతో విషయం చాలా తీవ్రతరమైనట్టే కనిపిస్తోంది. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర బీజేపీలో అగ్గి రాజేసినట్టయిందనే టాక్ వినిపిస్తుంది.

**లక్ష్మణ్, కిషన్ రెడ్డి, బండి సంజయ్ టార్గెట్‌గా వ్యాఖ్యలు**

రాజాసింగ్ బీజేపీలో చేరినప్పటి నుంచి తన వివాదస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తున్నారు. రాజాసింగ్ మొదటి నుంచి కూడా ఆ పార్టీ సీనియర్ నేతలు లక్ష్మణ్, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తూ వస్తున్నారు. గతంలోనూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక అంశంలో, ఫ్లోర్ లీడర్ ఎంపిక అంశంలో, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక అంశంలో, జిల్లాల అధ్యక్షుల ఎన్నిక అంశంలో బహిరంగంగానే హై ఓల్టేజ్ విమర్శలు చేస్తూ నేతలను ఏకి పారేస్తూ వస్తున్నారు.

**లెటర్ పుణ్యమా అని కమలం పార్టీలో ముసలం**

తాజాగా కల్వకుంట్ల డాడీ డాటర్ లెటర్ ఎపిసోడ్‌లో బీజేపీ బలయ్యిందనే టాక్ వినిపిస్తోంది. లెటర్ల సంభాషణలతో డాడి డాటర్ బెటర్‌గానే ఉన్నారు. కానీ ఈ లెటర్ పుణ్యమా అని కమలం పార్టీలో మాత్రం ముసలం మొదలైంది. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుంది అంటూ కవిత చేసిన ఆరోపణలకు రాజాసింగ్ మద్దతు పలకడం ఇప్పుడు ఆ పార్టీలో సంచలనంగా మారింది. అంతేకాదు మంచి ప్యాకేజీలు దొరికితే మా పార్టీ వాళ్లు బీఆర్ఎస్ కు అమ్ముడుపోతారంటూ రాజాసింగ్ చేసిన విమర్శలకు నేతలంతా సందిగ్ధంలో పడ్డట్టుగా తెలుస్తోంది. రాజాసింగ్ చేస్తున్న విమర్శలు పార్టీ నేతలు అసహనాలు వ్యక్తమవుతున్నాయి.

**రాజాసింగ్ పార్టీలో ఉంటారా? లేదా?**

రాజాసింగ్ చేస్తున్న ఆరోపణలన్నీ ప్రతీది పూస గుచ్చినట్లు అధిష్టానం దృష్టికి రాష్ట్ర నేతలు తీసుకెళ్తున్నారనే టాక్ ఉంది. అందులో భాగంగానే క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు అధిష్టాన పెద్దలు సిద్ధమవుతున్నారనే చర్చ జోరుగానే జరుగుతోంది. అయితే రాజాసింగ్ చేస్తున్న సంచలన ఆరోపణలు, విమర్శలపై అధిష్టానం చర్యలు తీసుకుంటుందా? లేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నాయకత్వానికి ఆదేశాలు జారీ చేస్తుందా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు రాజాసింగ్‌కు నోటీసులు ఇచ్చే ధైర్యం చేస్తుందా..? అనేది కూడా చూడాల్సి ఉంది. ఒక వేళ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటే రాజాసింగ్ పార్టీలో ఉంటారా? లేదా? అనే దానిపై కూడా సస్పెన్స్ కొనసాగుతోంది.

**తనపై చర్యలు కాదు.. పూర్తిగా సస్పెండ్ చేయాలని సవాల్**

రాజాసింగ్‌పై క్రమశిక్షణ చర్యలటూ పెద్ద ఎత్తున వార్తలు రావడంతో మరోసారి రాష్ట్ర బీజేపీ నాయకత్వంపై మరోసారి సంచలన కామెంట్స్ చేశారు. పార్టీకి దమ్ముంటే తనపై చర్యలు కాదు.. పూర్తిగా సస్పెండ్ చేయాలనీ సవాల్ విసిరారు. అంతే కాదు క్రమశిక్షణ నోటీసులు జారీ చేసినా.. సస్పెండ్ చేసినా పార్టీ నేతల జాతకం అంతా ప్రజల ముందు ఉంచి వెళ్తానంటూ వార్నింగ్ కూడా ఇచ్చారు. భయపడేది లేదంటూనే.. ట్రాన్స్‌జెండర్ లాంటి నేతల ఉంటూ పార్టీని ముందుకు నడిపించలేమని వ్యాఖ్యానించారు.

**కవిత వ్యాఖ్యలకు బలాన్ని చేకూరుస్తూ మౌనం వహిస్తారా?**

అలాంటి వారితో కలిసి హిందూ ధర్మ కార్యక్రమాలను నిర్మించలేమన్నారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు మరింత రచ్చను లేపాయి. మొత్తం మీద సొంత పార్టీపైనే విమర్శలు చేస్తున్న రాజాసింగ్‌పై పార్టీ నాయకత్వం చర్యలు చేపడుతుందా..? లేక రాజాసింగ్ చేస్తున్న వ్యాఖ్యలతో పాటు, బీజేపీలో బీఆర్ఎస్‌లో విలీనం అంటూ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలకు బలాన్ని చేకూరుస్తూ జాతీయ పెద్దలు, రాష్ట్ర నేతలు మౌనం వహిస్తారా అనేది చూడాలి.

# బిజెపి-బిఆర్ఎస్ కుట్ర రాజకీయాలపై జవాబివ్వండి



హైదరాబాద్, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద పండగలా నిర్వహించినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. జూన్ 2న భారాస మాత్రమే ఈ వేడుకలను నిర్వహించలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం గుర్తుంటుందా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జూన్ 2న కేసీఆర్ బయటికి రాలేదు. కనీసం అమరవీరులకు నివాళులర్పించలేదు. కేటీఆర్ అమెరికాకు వెళ్లారు.. ఆయనా రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనలేదు. అధికారం లేకపోతే ఈ వేడుకల్లో పాల్గొనరా,అధికారం ఇవ్వకుంటే ప్రజల్లోకి వచ్చేది లేదని భారాస నేతలు ఒక సంకేతం ఇచ్చారు. రాష్ట్రంలో 25.35 లక్షల మంది రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ చేసింది. గతంలో భారాస ప్రభుత్వం రుణమాఫీని సక్రమంగా ఎప్పుడూ పూర్తి చేయలేదని ఆది శ్రీనివాస్ విమర్శించారు. బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అవుతుందని ఎమ్మెల్సీ కవిత లేఖలో పేర్కొందని ఆది శ్రీనివాస్ తెలిపారు. పొత్తు పెట్టుకోకుండా ఉండటానికి బీఆర్ఎస్ ఉండాలి కదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కేడర్‌ను మభ్య పెట్టేందుకే మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్నారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కలిసి కాంగ్రెస్‌ని దొంగదెబ్బ తీయాలని చూస్తున్నారని ఆరోపించారు. కవిత చెప్పిన దెయ్యాలు ఎవరో హరీష్‌రావు సమాధానం చెప్పాలని అన్నారు. పార్టీ ఇంటర్నల్ విషయాలు బయటకి చెప్పిన కవితపై చర్యలు తీసుకుంటారా అని నిలదీశారు. మాజీ సీఎం కేసీఆర్‌కి అధికారం లేకపోతే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కూడా చేయరా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నల వర్షం కురిపించారు. ఇకపోతే వేములవాడ రాజన్న ఆలయంలో ఇటీ-వల కోడెలు మృతిచెందాయి. ఈ సంఘటన తెలంగాణలో చర్చనీయాంశంగా మారింది. భక్తులు ఇచ్చిన కోడెలు మృతిచెందడంపై పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే ఈ సంఘటనపై వెంటనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కోడెల రక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయితే కోడెలు మృతిచెందిన సంఘటనపై తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. రాజన్న ఆలయంలో కోడెల మృతిపై సమీక్ష చేశామని ఆది శ్రీనివాస్ తెలిపారు. వర్షాకాలం వ్యాధుల వల్ల కోడెలు చనిపోవడం బాధాకరమని తెలిపారు. కొందరు భక్తులు పాలు కూడా మరువని కోడెలను తీసుకువస్తున్నారని చెప్పారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని విస్తరణ చేస్తున్నామని వెల్లడించారు. పాత ఆలయం, పాత మండపాలు యధావిధిగా ఉంటాయని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# నటుడు కమలహాసన్‌పై హైకోర్టు ఆగ్రహం



బెంగళూరు, క్షమాపణలు చెబితే సమస్య సమసిపోయే దానికి ఎందుకీ పట్టుదల అంటూ నటుడు కమలహాసన్‌పై కర్నాటక హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షమాపణలు చెప్పనప్పుడు వ్యాఖ్యలు ఎందుకు చేయాలని కూడా ప్రశ్నించింది. ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి మీరేమైనా చరిత్రకారులా అని నిలదీసింది. 'థగ్ లైఫ్' విడుదలను నిషేధించాలని కోరుతూ కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కేఎఫ్‌సీసీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, మంగళవారం దీన్ని విచారించిన హైకోర్టు కమల్ హాసన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంత పెద్ద నటుడైనప్పటికీ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఆయనకు లేదని హెచ్చరించింది. ఈ అంశంపై తీవ్రంగా స్పందించింది. అతడి వ్యాఖ్యలకు ఆధారాలను అడిగింది. 'ఒక్క క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని' వ్యాఖ్యానించింది. మీరు కమల్‌హాసన్ కావచ్చు లేదా మరెవరైనా కావచ్చు. ప్రజల మనోభావాలను దెబ్బతీయలేరు. ఒక ప్రజాప్రతినిధిగా అలాంటి ప్రకటన చేయకూడదు. మీ కామెంట్స్ వల్ల అశాంతి ఏర్పడింది. కన్నడ ప్రజలు మిమ్మల్ని క్షమాపణలు మాత్రమే అడిగారు. మీరు ఏ ప్రాతిపదికన ఆ ప్రకటన చేశారు? మీరు ఏమైనా చరిత్రకారులా? లేక భాషావేత్తనా? ఎందుకు అలాంటి వ్యాఖ్యలు చేశారని కమల్‌హాసన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. క్షమాపణ చెప్పే ఉద్దేశం లేకపోతే, కర్ణాటకలో సినిమా విడుదల ఎందుకని ప్రశ్నించింది. క్షమాపణ చెప్పని పక్షంలో కర్ణాటకలో సినిమాను ఎందుకు ప్రదర్శించాలనుకుంటున్నారు? వదిలేసేయండి. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ హద్దులు దాటి, ప్రజల మనోభావాలను దెబ్బతీయకూడదు కదా. మీరు క్షమాపణ చెబితే ఏ సమస్యా ఉండదు. మీ సినిమాను ప్రదర్శించటం ద్వారా కర్ణాటక నుంచి కూడా మీరు రూ.కోట్లలో ఆదాయాన్ని పొందవచ్చని కోర్టు పేర్కొంది. కమల్‌హాసన్ ఉద్దేశ పూర్వకంగా ఆ వ్యాఖ్యలు చేయలేదని ఆయన తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకురాగా, 'పరిస్థితుల కారణంగా బాధితుడయ్యే వ్యక్తికీ, వాటిని సృష్టించే వ్యక్తికీ మధ్య చాలా తేడా ఉంది. ఇప్పటికే కమల్‌హాసన్ బాహటంగా తన అభిప్రాయాన్ని ప్రకటించారు. దాన్ని మీరు ఇప్పుడు కప్పిపుచ్చలేరు. మిగిలింది క్షమాపణలు చెప్పడమే' అని కోర్టు వ్యాఖ్యానించగా, కమల్‌హాసన్ పరిస్థితిని చక్కబరిచేందుకే ప్రయత్నించినా, అది పక్కదారి పట్టిందని ఆయన తరపు న్యాయవాది అన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ 'కావచ్చు. కానీ, కారణం ఎవరు? మీరే పరిస్థితి చేయిదాటిపోయేలా చేశారు. ఇప్పుడు మీ సినిమాను రక్షించాలని కోరుతున్నారని కోర్టు వ్యాఖ్యానించి ంది. ఇటీ-వల జరిగిన 'థగ్ లైఫ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తమిళం నుంచి కన్నడ పుట్టిందంటూ కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి కారణమయ్యాయి. దీంతో ఆయన వ్యాఖ్యలపై అధికార, విపక్ష పార్టీలతో పాటు- కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా తీవ్రంగా స్పందించాయి. ఈ క్రమంలోనే 'థగ్‌లైఫ్'ని కర్ణాటకలో నిషేధించాలని కోరుతూ కేఎఫ్‌సీసీ హైకోర్టును ఆశ్రయించింది.

# ఏడాదిలో చంద్రబాబు సర్కారు చేసిన అప్పు ఎంత?



అమరావతి,ఓవైపు విభజన గాయాలు.. మరోవైపు ప్రభుత్వాలు ఒక టర్మ్ తర్వాత ఒక్కో పార్టీ అధికారంలోకి రావటం.. విధానాల పరంగా తీసుకుంటున్న నిర్ణయాలు.. పాలనాపరమైన ప్రాధాన్యతల్లో వచ్చే మార్పులు ఏపీ ఆర్థిక పరిస్థితిని మారేందుకు సాయం చేయటం లేదు. గత ఏడాది ఎన్నికల్లో అద్భుత విజయాన్ని సాధించి.. పాలనా పగ్గాల్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం తన సంవత్సర పాలనలో చేసిన అప్పు ఎంత? దేని కోసం ఎంత అప్పు చేసింది? అన్నదిప్పుడు చర్చగా మారింది.కూటమి ప్రభుత్వం కొలువు తీరి నిన్న (మంగళవారం)టి ఏడాది పూర్తైంది. ఆసక్తికరమైన అంశం ఏమంటే.. ప్రభుత్వం కొలువు తీరిన తేదీన.. రూ.7వేల కోట్ల తాజా అప్పు తీసుకోవటం చూసినప్పుడు ఏపీ ఆర్థిక పరిస్థితి ఎప్పుడు మెరుగవుతుంది? అన్నది పెద్ద ప్రశ్న. తాజాగా చేసిన అప్పుతో బడ్జెట్ అప్పులే ఏకంగా రూ.1,01,194 కోట్లకు చేరాయి. ఆర్ బీఐ.. రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీల వేలం ద్వారా 6.61 శాతం నుంచి 6.84 శాతం వడ్డీకి ఈ మొత్తం అప్పును సమీకరించింది.బడ్జెట్ లోపలే కాకుండా బడ్జెట్ బయటా అప్పులు చేయటం కనిపిస్తుంది.వివిధ కార్పొరేషన్ల పేరుతో ప్రభుత్వ గ్యారెంటీతో రూ.19,410 కోట్ల అప్పు ఏడాదిలో చేశారు. ఇంకోవైపు రాజధాని అమరావతి పేరుతో ప్రపంచ బ్యాంక్.. జర్మనీక చెందిన సంస్థ నుంచి రూ.31 వేల కోట్లు చేయనుంది. ఇవన్నీ కలిపితే ఏడాదిలో రూ.1.51 లక్షల కోట్లు అప్పు చేసినట్లు అవుతుంది. ఇక్కడ గుర్తించాల్సిన అంశం ఏమంటే.. రాజధాని నిర్మాణం కోసం చేస్తున్న రూ.31 వేల కోట్లను లెక్కలోకి తీసుకోకూడదు.ఎందుకంటే.. ఈ అప్పు పైసలు చేతికి రాలేదన్న విషయాన్ని మర్చిపోకూడదు. మొత్తంగా చూస్తే.. చంద్రబాబు సర్కారు ఏడాది పాలనలో బడ్జెట్ అప్పు రూ.1,01,194 కోట్లు కాగా.. బడ్జెటేతర అప్పు రూ.19,410 కోట్లను మాత్రమే రుణాలుగా తీసుకోవాలి. ఏమైనా తన ప్రభుత్వ హయాంలో అయినా.. అప్పులు తీసుకునే అలవాటును కూటమి సర్కారు తగ్గిస్తే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# జీహెచ్ఎంసీ బార్లకు దరఖాస్తుల వెల్లువ..



హైదరాబాద్, జీహెచ్ఎంసీ పరిధిలోని 24 బార్లకు మిగిలిన మూడు రోజుల వ్యవధిలో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పీ. దశరథ్ తెలిపారు.నాంపల్లి కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఇటీవల రూరల్ ప్రాంతాల్లో బార్లకు అనూహ్యంగా అధిక దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. మొత్తంగా జీహెచ్ఎంసీతో కలిపి 28 బార్లకు పునరుద్ధరణ కోసం దరఖాస్తులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు జీహెచ్ఎంసీ పరిధిలోని 24 బార్లకు 356 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. రూరల్ బార్ల కంటే ఎక్కువగా జీహెచ్ఎంసీలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దరఖాస్తుల గడువు ఈ నెల 6వ తేదీ వరకూ ఉంటుందని స్పష్టం చేశారు.

# ఇదే జరిగితే.. మోడీకి మరో ఇబ్బందే!



న్యూఢిల్లీ,ప్రధాని నరేంద్ర మోడీకి మరో చిక్కు వచ్చింది. విశ్వగురువుగా ఆయన తన కీర్తిని ప్రపంచ దేశాలకు విస్తరించుకున్న విషయం తెలిసిందే. భారత్‌ను, ప్రధానిని కూడా ఇప్పుడు విశ్వగురువుగా.. పలుదేశాలు చూస్తున్నాయి. అయితే.. రాను రాను.. ఈ ప్రభావం తగ్గుతోందన్న వాదన బలంగా వినిపిస్తోంది. కెనడా, బంగ్లాదేశ్, చైనా, పాకిస్థాన్ సహా.. పలు దేశాలు.. భారత్ అనుసరిస్తున్న విధానాలను తప్పుబడుతున్నాయి. అంతేకాదు.. వ్యక్తిగత విమర్శలు కూడా చేస్తున్నాయి.మరీ ముఖ్యంగా భారత విదేశాంగ విధానంపైనా తరచుగా విమర్శలు వస్తున్నాయి. కీలకమైన సందర్భాల్లో భారత్ మౌనంగా వ్యవహరించడాన్ని చాలా వరకు దేశాలు తప్పుబడుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా కెనడా నుంచి మరో ఊహించని ఉపద్రవం వెంటాడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదే జరిగితే.. మోడీకి మరో ఇబ్బంది ఖాయమని పరిశీలకులు చెబుతున్నారు. ఏటా.. జీ-7 దేశాల సదస్సు జరుగుతుంది. జీ-7 దేశాలంటే.. అభివృద్ధి చెందిన దేశాలు.వీటిలో అమెరికా, బ్రిటన్, జపాన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ ఉన్నాయి. ఈ దేశాలు.. ప్రతి సంవత్సరం భేటీ అయి.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సమస్యలపై చర్చించి.. అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటాయి. అయితే.. భారత్కు దీనిలో సభ్యత్వం లేకపోయినా.. ప్రతి సంవత్సరం ఆతిథ్య దేశం ఠంచనుగా ఆహ్వానం పలుకుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్‌ను గుర్తించి.. భారత్ ఇచ్చే సలహాలు, సూచనలను తీసుకుంటుంది.ఈ సంవత్సరం సమావేశం ఈ నెల 15న కెనడాలో జరగనుంది. అయితే.. భారత్‌కు-కెనడాకు మధ్య సిక్కు ల విషయంలో వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఎలాంటి ఆహ్వానం దక్కలేదు. వాస్తవానికి నెల రోజుల ముందే.. ఆహ్వానం అందుతుంది. కానీ.. ఈ సారి మాత్రం అందలేదు. దీనిపై అనేక విమర్శలు వస్తున్నాయి. కెనడా మద్దతు దారుగా ఉన్న పాకిస్థాన్‌కు ఆహ్వానం అందడం.. దాయాది దేశం రెడీకావడం.. ఇదే సమయంలో శాంతిని ప్రవచిస్తున్న భారత్‌కు ఆహ్వానం లేకపోవడం వంటివి చర్చకు దారితీస్తున్నాయి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com